

మీ కష్టంతోనే గెలిచాం..!

- పార్టీ కోసం పనిచేసిన వారికే ప్రాధాన్యం
- పొద్దు తిరుగుడు పువ్వులు అవసరం లేదు
- కార్యకర్తలకు మంత్రి పయ్యావుల కేశవ్ భరోసా
- అట్టహాసంగా టీడీపీ జిల్లా మినీ మహానాడు



జిల్లా మహానాడులో ప్రసంగిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం/అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల్లో మమ్మల్ని గెలిపించారు. మీ కష్టంతోనే మేము వేదికపై కూర్చున్నాం. మీ కష్టాలలో తోడుగా మేముంటాం. మీ రుణాన్ని తీర్చుకుంటాం. పార్టీ కోసం పనిచేసిన వారికి తప్పని సరిగా ప్రాధాన్యం ఇస్తాం' అని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ టీడీపీ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పరంగా జిల్లా అభివృద్ధికి పాటుపడుతూనే, ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తామని అన్నారు. అనంతపురం శివారులోని ఓ ఫంక్షన్ హాలులో టీడీపీ జిల్లా మినీ మహానాడు సభను గురువారం అట్టహాసంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సభ ప్రారంభానికి ముందు రెండు నిమిషాలు మౌనం పాటించి, గత రెండేళ్లలో మరణించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సంతాపం తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన (మిగతా 6లో)

జై హనుమాన్..!



హౌసింగ్‌బోర్డు భక్తాంజనేయస్వామి దేవాలయంలో పూజలందుకుంటున్న స్వామివారు



హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. స్వామివారి దర్శనానికి ఆలయాలకు క్యూ కట్టారు. హనుమద్ వ్రతాలు, ఆకు పూజలు, అన్నదాన కార్యక్రమాలతో ఆలయాల వద్ద సందడి కనిపించింది. హనుమాన్ చాలీసా పఠనం, పల్లకి సేవలలో భక్తులు భారీగా పాల్గొన్నారు.

\- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్



కోర్టురోడ్డులో స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

తుంగభద్రకు ముందస్తు ఇన్‌ఫ్లో

- 22 రోజుల్లో 4 టీఎంసీల చేరిక
- జలాశయంలో 10 టీఎంసీల నిల్వ



తుంగభద్ర డ్యాంలో చేరిన జలాలు

రాయదుర్గం, మే 22(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి ఎన్నడూ లేని విధంగా ముందస్తుగా నీరు చేరుతోంది. కర్ణాటక ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా జలాశయానికి నీటి లభ్యత రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా మే మాసంలో నీటిలభ్యత పూర్తి శూన్యంగా ఉంటుంది. ఈ ఏడాది మాత్రం ఆశలు నింపుతోంది. 22 రోజుల్లో నాలుగు టీఎంసీల దాకా నీటి లభ్యత దక్కింది. ఇప్పటికే 10 టీఎంసీల మేరకు జలాశయంలో నీటి నిల్వ ఉంది. జలాశయానికి ఎగువన శివమొగ్గ, అగుంబి తదితర ప్రాంతాలలో వర్షాలు పెద్ద ఎత్తున కురుస్తుండటంతో పాటు జలాశయ పరివాహక ప్రాంతంలో కూడా వర్షాలు బాగా కురుస్తున్నాయి. దీంతో జలాశయంలోకి ముందస్తుగా నీరు చేరుతోంది. గత ఏడాది జలాశయంలో మూడు టీఎంసీల నీరు నిల్వ ఉండి ఇన్‌ఫ్లో జీరో స్థాయిలో ఉండేది. సాధారణంగా ఈ సమయానికి ఆరు టీఎంసీలు నిల్వ ఉండి ఇన్‌ఫ్లో ఏ మాత్రం ఉండేది కాదు. ఈనెల 1న జలాశయంలో 6.846 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 390 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మొదలైంది. క్రమేపీ ఇన్‌ఫ్లో పుంజుకుంటూ 15వ తేదీకి 1040 క్యూసెక్కులకు పెరిగింది. 16న 1160, 17న 1630, 18న 3200, 19న 2223, 20న 5400, 21న 9650, గురువారం 8900 క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రస్తుతం జలాశయంలో 10.058 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాధారణంగా జూన్ రెండో వారం నుంచి జలాశయానికి ఇన్‌ఫ్లో ప్రారంభమవుతుంది. ఈ ఏడాది ముందస్తుగా రుతుపవనాల ప్రవేశ ప్రభావం వల్ల నీటి లభ్యత కనిపిస్తోందని బోర్డు అధికారులు వెల్లడించారు.

17 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 17 మండలాల్లో బుధవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా ఉరవకొండలో 30.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. బెళుగుప్ప 23.8, శెట్టూరు 18.2, కణేకల్లు 17.0, కళ్యాణదుర్గం 16.4, వజ్రకరూరు 16.2, ఆత్మకూరు 12.0, డి.హీరేహాళ్ 8.2, రాయదుర్గం, శింగనమల 5.2, బ్రహ్మసముద్రం 5.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 3.6 మి.మీ. వరకూ నమోదైంది.

అమ్మ దొంగా..!

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హైడ్రామా..
- మెస్ బిల్లుల స్వాహాపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రచారం
- జస్ట్.. సీఐని కలిసి వచ్చినట్లు నిర్ధారణ
- అందరిపాత్ర ఉండటంతోనే నాటకాలా?



టూటౌన్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు

అనంతపురం టౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలో మెడికోల మెస్‌బిల్లుల స్వాహా వ్యవహారంలో పెద్ద హైడ్రామానే నడిచింది. ఈ వ్యవహారం చివరకు ప్రిన్సిపాల్, పర్యవేక్షణ డాక్టర్ల మెడకు చుట్టుకున్నట్లు తెలుస్తోంది. ముందునుంచీ మహిళా అకౌంటెంట్.. వైద్య విద్యార్థినులతో నెలనెలా వ్యక్తిగత ఖాతాలోకి డబ్బు జమ చేయించుకుని, అక్రమాలకు పాల్పడినట్లు వెలుగుచూసింది. ఆ తర్వాత ఈ వ్యవహారంపై అనేక ఆరోపణలు వచ్చాయి. మహిళా అకౌంటెంట్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయకున్నా.. చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రచారం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. అన్ని విషయాలూ బయట పెడతానని అకౌంటెంట్ బెదిరిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఫిర్యాదు చేయకుండా హైడ్రామా ఆడినట్లు చర్చ సాగుతోంది.

ఉద్యోగి కాకపోయినా..

మహిళా అకౌంటెంట్ కళాశాల ఉద్యోగికాదు, ఓ ప్రైవేటు వ్యక్తి. ఆమెకు లక్షలు వసూలు చేసే బాధ్యతను ఎందుకు అప్పజెప్పారు, ఎలా ఇచ్చారన్నదే పెద్ద ప్రశ్న. నిబంధనల మేరకు మెడికోలు ప్రతినెలా మెస్ బిల్లుల డబ్బు హాస్టల్ ఖాతాల్లోకి జమచేయాల్సి ఉంటుంది. అక్కడి నుంచి సరుకులు, వంటలు, స్నాక్స్ అందించేవారికి డబ్బు డ్రాచేసి నెలనెలా చెల్లిస్తారు. మెస్ బిల్లుల సొమ్మును ఓ ప్రైవేటు వ్యక్తి తన ఖాతాలోకి జమ చేయించుకుంటుంటే హాస్టల్ వార్డెన్లుగా నియమితులైన మహిళా వైద్యులు ఎందుకు పట్టించుకోలేదన్న సందేహాలు తలెత్తుతున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ ఎందుకు పర్యవేక్షించలేదనేది అంతుచిక్కట్లేదు.

ఎందుకీ డ్రామా?

మెస్‌బిల్లుల డబ్బు స్వాహా వ్యవహారంపై చివరకు డీఎంఈ నరసింహం జిల్లాకు వచ్చి విచారణ చేశారు. అందులో భాగస్వామ్యం ఉన్న వారందరినీ పిలిపించుకుని, డబ్బు వ్యవహారం, లావాదేవీల గురించి ఆరాతీశారు. వారందరి నుంచి రాతపూర్వకంగా సమాధానాలు తీసుకున్నారు. రూ.18 లక్షలకుపైగా పక్కదారి పట్టినట్లు గుర్తించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని డీఎంఈ ఆదేశించారు. మంగళవారం రాత్రే టూటౌన్‌పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు తెలిపారు. టూటౌన్‌కు వెళ్లి సీఐని కలిసి, ఫిర్యాదు ఇవ్వకుండా వెళ్లిపోయారని తేలింది. దీనిపై పెద్దఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ స్వాహా వ్యవహారంలో అందరిపాత్ర ఉందనీ, మహిళా అకౌంటెంట్ మీద కేసుపెడితే అందరి బండారం బయట పడుతుందనే ప్రిన్సిపాల్ ఫిర్యాదు డ్రామా ఆడినట్లు చర్చసాగుతోంది. దీనిపై పెద్ద దుమారం రేగడంతో ఎట్టకేలకు ప్రిన్సిపాల్ గురువారం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. డబ్బు స్వాహాపై మహిళా అకౌంటెంట్ ఏం చెబుతుంది, ఎవరెవరు ఇరుక్కుంటారోనని తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈవిషయంలో డీఎంఈ సైతం సీరియస్‌గా ఉన్నారనీ, తప్పకుండా ఇద్దరు ముగ్గురిపై వేటుపడే అవకాశాలున్నాయనే ప్రచారం వైద్యవర్గాల్లో సాగుతోంది. మొత్తమ్మీద కథ అడ్డం తిరగడంతో ఏం జరుగుతుందో చూడాలి మరి.

అకౌంటెంట్‌పై కేసు నమోదు

అనంతపురం క్రైం: వైద్య కళాశాలలో అకౌంటెంట్ వాణిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిసిన వివరాలిలా ఉన్నాయి. మెస్ బిల్లుల్లో రూ.30 లక్షలు అవినీతికి పాల్పడ్డారని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు గురువారం అకౌంటెంట్ వాణిపై కేసు నమోదు చేశారు.

రేషన్ సరుకులు నాణ్యంగా ఉన్నాయా?

- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆరా
- రేషన్ పంపిణీ పరిశీలన



రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): 'ఏమ్మా.. రేషన్ సరకులు తీసుకుంటున్నారా.. అవి నాణ్యతగా ఉన్నాయా' అంటూ లబ్ధిదారులను కలెక్టర్ వినోద్‌కుమార్ అడిగి తెలుసుకున్నారు. స్థానిక సాయినగర్ రండోక్రాస్‌లోని 134వ నంబరు రేషన్ షాపును కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. తొలుత డీలర్ షాపునకు వెళ్లి స్టాక్ ఎంత మేర వచ్చింది, ఇప్పటివరకు ఎంతమందికి పంపిణీ చేశారని ఆరాతీశారు. నిల్వపై రికార్డుల మేరకు ఆన్‌లైన్‌లో ఆరాతీశారు. అనంతరం ఆ ప్రాంతంలోని లబ్ధిదారుల ఇళ్లవద్దకు కలెక్టర్ వెళ్లి.. 'బియ్యం తీసుకున్నారా.. పంచదార, గోధుమపిండి ఇచ్చారా, సరకులు ఇవ్వకుండా డబ్బులు ఏమైనా ఇచ్చారా.. సరుకులు, బియ్యం నాణ్యతగా ఉన్నాయా' అంటూ అడిగి తెలుసుకున్నారు. బియ్యం తెప్పించుకుని, నాణ్యతను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అనంతపురం అర్బన్‌లో ఎక్కువ మంది లబ్ధిదారులు ఐవీఆర్‌ఎస్ సర్వేలో బియ్యం నాణ్యతగా లేవని ఫిర్యాదు చేశారన్నారు. ఆ మేరకు రేషన్ షాపును పరిశీలించానన్నారు. దీపం సిలిండర్ల పంపిణీలో డెలివరీ బాయ్స్‌పై ఆరోపణలు వస్తున్నాయనీ, వారు ప్రవర్తన మార్చుకోవాలన్నారు. పదేపదే ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ హెచ్చరించారు. తనిఖీలో డీఎస్‌ఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ హరికుమార్, సీఎస్‌డీటీ రామకృష్ణ పాల్గొన్నారు.

బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టాలి..

జిల్లాలో బాల్యవివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బాల్యవివాహాల నిర్మూలనపై గురువారం సమీక్ష జరిగింది. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలన విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలన్నారు. విషయం తెలిసిన వెంటన ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం ఇచ్చి అక్కడ పెళ్లి జరగకుండా ఐసీడీఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కౌమారదశ బాలికలకు ఆర్డీటీ, ఇతర స్వచ్ఛందసంస్థల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలోను బాల్యవివాహాల గురించి పోస్టర్లు, వాల్‌రైటింగ్స్ వేయించాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ, డీఆర్‌డీఏ పీడీ శైలజ, బీసీ వెల్ఫేర్‌డీడీ ఖుష్బూ కొఠారి, డీఎస్పీ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఎందుకు కట్టాలి..?

- జరిమానా కట్టం.. కోర్టులో తేల్చుకుంటాం
- కార్పొరేషన్ అధికారులకు వ్యాపారుల ఝలక్



చెత్తపై దుకాణదారులతో మాట్లాడుతున్న కమిషనర్, అధికారులు

అనంతపురం క్రైం, మే22(ఆంధ్రజ్యోతి): 'ఎందుకు కట్టాలి జరిమానా...? మీరు చెత్త తరలించే వాహనాలు పంపారా..? చెత్త ఎక్కడ వేయాలి..?' అంటూ పలువురు దుకాణదారులు ప్రశ్నించారు. ఇలా జరిమానా వేయడానికి వెళ్లిన నగరపాలక సంస్థ అధికారులకు ఝలక్ ఇచ్చారు. నగరంలో దుకాణాల ఎదుట చెత్త ఉంచితే చర్యలు తీసుకుంటామనీ, జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అందులో భాగంగా గురువారం నగర పాలక సంస్థ అధికారులు రంగంలోకి దిగారు. కమిషనర్ బాలస్వామి, పారిశుధ్య విభాగ అధికారులు పాతూరులో కొన్ని దుకాణాల ఎదుట చెత్త ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఓ దుకాణానికి రూ.20వేలు జరిమానా, మరి కొన్నింటికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వేశారు. దీనిపై దుకాణదారులు ఎదురు ప్రశ్నించారు. జరిమానా విషయంలో కోర్టులో తేల్చుకుంటామన్నారు. చెత్త తరలించే వాహనాలు రాకపోతే తామేం చేస్తామని నిలదీశారు. చివరికి రూ.2500 విధించిన రెండు దుకాణదారులు చెల్లించారు. అనంతరం కమలానగర్‌లో కొన్ని దుకాణాలకు జరిమానా విధించగా అందులో 30 శాతం చెల్లించారు. ఆ మాత్రమైనా చెల్లించినందుకు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి కేశవ్, ఎమ్మెల్యేలు, నాయకులు





మీ కష్టంతోనే గెలిచాం..!

జిల్లా సస్యశ్యామలం: వెంకటశివుడు యాదవ్



హంద్రీనీవా కాలువ వెడల్పుతో అదనపు నీరు వస్తే జిల్లా సస్యశ్యామలం అవుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. వైసీపీ హయాంలో పరిశ్రమలను తరిమేశారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే రాష్ట్రానికి తిరిగి పరిశ్రమలు తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని అన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి, అన్ని స్థానాల్లో విజయం సాధించేలా కృషి చేయాలని అన్నారు. 'మళ్లీ అధికారంలోకి వస్తే మీ కథ చూస్తాం' అని జగన్ చెబుతున్నారంటే.. ఒక్కసారి అందరూ ఆలోచించుకోవాలని, పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు పాటుపడాలని అన్నారు.

ఏకపక్షంగా గెలవాలి: కాలవ



రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమైన శక్తిగా పార్టీని నిలపాలని, ఏకపక్షంగా అన్ని స్థానాల్లో విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తామని అన్నారు. పింఛన్ల పంపిణీ, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ తదితర పథకాల అమలు గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. సీఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చాటిచెప్పాలని అన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు వేగంగా సాగుతున్నాయని, ఇందుకు సీఎం చంద్రబాబు, మంత్రి పయ్యావుల కేశవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. ఆర్థిక మంత్రి హోదాలో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, అన్ని నియోజకవర్గాల అభ్యున్నతికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి ముందుకు సాగుతున్నారని అన్నారు.

రుణపడి ఉంటాం: అంబికా



వైసీపీ పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించినా జైలుకు పంపారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. అయినా బెదరింకుండా పార్టీ అధికారంలోకి వచ్చేందుకు పాటుపడిన నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటామని అన్నారు. ఎమ్మెల్యేలతో పాటు తాను ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే.. పదవులు వాటంతట అవే వస్తాయని అన్నారు. తనకు ఆ విధంగానే అవకాశాలు వచ్చాయని అన్నారు. పార్టీ కోసం ఎవరెవరు పనిచేస్తున్నారో అధిష్ఠానం గమనిస్తోందని అన్నారు. అనంతలో ఉద్యాన పంటలు ఎక్కువగా సాగవుతున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉద్యాన ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు జిల్లాలో కార్గో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసేలా మంత్రి చొరవ చూపాలని కోరారు.

ఎన్టీఆర్ బాటలో చంద్రబాబు: గుమ్మనూరు



బడుగు, బలహీనవర్గాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఘనత నందమూరి తారకరామారావుకు దక్కుతుందని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. ఆయన బాటలోనే సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో అర్హులకు లబ్ధి చేకూరుస్తున్నారని అన్నారు. ఇటీవల గుత్తి మండలంలో రూ.22 వేల కోట్లతో రెన్యూ సంస్థ ఎనర్జీ ప్రాజెక్టుకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయడం గర్వకారణమని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 10 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని అన్నారు.

(5వ పేజీ తరువాయి)

వీరజవాన్ మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

పొద్దు తిరుగుడు పువ్వులు వద్దు: కేశవ్

కొందరు నాయకులు ఏ పార్టీ అధికారంలో ఉంటే అటువైపు పొద్దుతిరుగుడు పువ్వు తరహాలో చూస్తుంటారని, అలాంటివారికి అవకాశం ఇవ్వాల్సిన అవసరం లేదని కేశవ్ అన్నారు. టీడీపీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు తొలిప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ఈ పద్ధతి తప్పితే పార్టీ కోసం కష్టపడిన వారిలో అసంతృప్తి రేకెత్తుతుందని, అలా జరగకుండా ప్రజాప్రతినిధులు చూసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రానికి మంత్రినైనా, జిల్లాకు ఒక కూలీగానే పనిచేస్తానని అన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పనులు చేసేందుకు రాత్రింబవళ్లు కష్టపడుతున్నామని అన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతోపాటు సకాలంలో పనులు ప్రారంభించామని, చెప్పిన మాటలను చేతల్లో చూపిస్తున్నామని అన్నారు. ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా నిశ్శబ్దంగా హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు చకచకగా జరిగిపోతున్నాయని అన్నారు. పొగతాగడం హానికరం అని సిగరెట్ పాకెట్‌పై ఎలా ముద్రించి గుర్తు చేస్తుంటారో... వైసీపీ పాలన ఈ రాష్ట్రానికి హానికరమని ప్రజలకు మళ్లీ మళ్లీ చెప్పాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే ఈ విషయాన్ని పదే పదే ప్రజలకు చెబుతూనే ఉండాలని అన్నారు.

తరలివచ్చిన నాయకులు

జిల్లా మినీ మహానాడుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు రామలింగారెడ్డి, గాజుల ఆదెన్న, కేసీ హరి, సరిపూటి సూర్యనారాయణ, బాంబే డయింగ్ నాగన్న, పర్వతనేని శ్రీధర్‌బాబు, గంజే నాగరాజు, డేగల కృష్ణమూర్తి, అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీ, మాజీ మేయర్ స్వరూప, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళి, దేవళ్ల మురళి, నాయకులు సుధాకర్‌నాయుడు, వెంకటప్ప, గంగారామ్, సరిపూటి రమణ, కృష్ణకుమార్, సుధాకర్ యాదవ్, కూచి హరి, కుంచెపు వెంకటేష్, సిమెంట్ పోలన్న, సింగవరం రవి, స్వామిదాస్, ముక్తియార్, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వరన్, కమలమ్మ, లక్ష్మీనాయుడమ్మ, లక్ష్మీనరసింహ, నెట్టెం బాలకృష్ణ, కురబ నారాయణస్వామి, తెలుగు మహిళలు గాండ్ల విశాలాక్షి, స్వప్న, కొండవీటి భావన, సంగా తేజస్విని, సరళ, వడ్డే భవాని, చరిత తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తూ..

అండగా ఉంటాం: శ్రావణి



కార్యకర్తల కష్టంతోనే అధికారంలోకి వచ్చామని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ బనాయించిన అక్రమ కేసులు, దాడులను ఎదుర్కొని కార్యకర్తలు నిలబడ్డారని అభినందించారు. దేశంలోనే కోటి మంది సభ్యత్వాలు కలిగిన ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి, అందరికీ న్యాయం చేస్తామని అన్నారు.

కార్యకర్తలను మరచిపోం: అమిలినేని



కష్టకాలంలో నిలబడి, పార్టీ విజయం కోసం పాటుపడిన కార్యకర్తలను ఎన్నటికీ మరిచిపోమని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. అలాంటి నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ముందుండి కాపాడుకుంటామని అన్నారు. ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ, 14 ఎమ్మెల్యే స్థానాలను గెలిపించిన ఘనత కార్యకర్తలకే దక్కుతుందని అన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని అన్నారు. చంద్రన్న పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

కష్టపడినవారిని గుర్తించండి: ఎద్దులపల్లి సుబ్రహ్మణ్యం

గత ఐదేళ్లలో కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసి, పార్టీ అధికారంలో వచ్చేందుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు గుర్తింపునివ్వాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఎద్దులపల్లి సుబ్రహ్మణ్యం కోరారు. వైసీపీ హయాంలో ఏర్పాటైన కొన్ని సలహా మండలి కమిటీల్లో ఇప్పటికీ వారే ఉన్నారని అన్నారు. అలాంటి స్థానాల్లో పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు అవకాశం ఇవ్వాలని కోరారు. జిల్లాపై సీఎం చంద్రబాబుకు ఎక్కువ ప్రేమ ఉందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, పార్టీని మరింతగా బలోపేతం చేయడంలో అందరూ భాగం కావాలని సూచించారు.

కార్యకర్తలతోనే విజయం: దగ్గుపాటి



ఉమ్మడి జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యేల విజయానికి కార్యకర్తలే కారణమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. వారిని ఎప్పటికీ మరువమని అన్నారు. వైసీపీ పాలనలో టీడీపీ అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు టీడీపీ పనైపోయిందని ప్రచారం చేశారని అన్నారు. ఎన్టీఆర్ స్థాపించిన పార్టీని ఎవరూ కదిలించలేరని నిరూపిస్తూ కార్యకర్తలంతా కసిగా పనిచేసి 164 స్థానాల్లో విజయం సాధించేలా పాటుపడ్డారని అన్నారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పాత్ర ఎంతో ఉందని అన్నారు. చంద్రబాబు చేసేదే చెబుతారని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని అన్నారు. అర్బన్ నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడుతూనే... ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని అన్నారు.



మృతిచెందిన టీడీపీ కార్యకర్తలు, వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తూ...

బ్రాండెడ్ లాంటిది..!

బస్టాండ్లలో వాటర్ బాటిళ్ల విక్రయాల్లో మాయాజాలం



బ్రాండ్ మాటున నకిలీ వ్యాపారం

ప్రయాణికుల ఆరోగ్యంతో చెలగాటం

నామమాత్రపు తనిఖీలకే పరిమితమవుతున్న అధికారులు

బ్రాండెడ్‌ను పోలిన నకిలీ వాటర్ బాటిళ్లు



అనంతపురం కల్చరల్, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రయాణంలో బస్టాండులో దాహం తీర్చుకునేందుకు ఓ వాటర్ బాటిల్ కొంటే. అది బ్రాండెడ్ మినరల్ వాటర్ బాటిల్‌ను పోలి ఉంటుంది. అదే కలర్.. అచ్చం అలాంటి లోగో.. జస్ట్ ఒక రెండు అక్షరాలు మాత్రం మార్చి ఉంటారు. అదే బ్రాండెడ్ వాటర్ బాటిల్ అని చెప్పి అంటగడుతుంటారు. తెలియని వాళ్లు ఆ బాటిలే కొనుక్కుని తాగుతుంటారు. అది పూర్తిగా నకిలీ. ఆ నీరు తాగితే అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. వ్యాపారులు అధిక ధనార్జన ఆశతో తక్కువ రేటు నకిలీ బ్రాండ్ బాటిళ్లను అంటగడుతున్నారు. ప్రయాణికుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఇదంతా పబ్లిక్‌గానే సాగుతున్నా.. అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుంటారు. నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

రూ.లక్షల్లో ఆదాయం..

బస్టాండ్లలో విక్రయించే వాటర్ బాటిళ్లలో అసలు ఏదో... నకిలీ ఏదో.. అంత ఈజీగా కనుక్కోలేని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి అనంతపురం బస్టాండు మీదుగా రోజుకు 80వేల మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్లలో బ్రాండెడ్‌ను పోలిన నకిలీ వాటర్ బాటిళ్లను అంటగడుతున్నారు. ఆ నీరు తాగితే ఆరోగ్యానికి ముప్పు తప్పదు. ఈ నకిలీ వాటర్ బాటిళ్ల గుట్టు తెలిసినవారు బ్రాండెడ్ వాటర్ బాటిల్ అడిగితే అలాంటి వారికి ఇచ్చేందుకు తక్కువ సంఖ్యలో బ్రాండెడ్ బాటిళ్లను ఉంచుకుంటున్నారు. లీటరు బ్రాండెడ్ వాటర్ బాటిల్ ధర వ్యాపారులకు రూ.16 వరకు ఉంటుందని తెలుస్తోంది. దానిని రూ.20లకు విక్రయిస్తే రూ.4 లాభం వస్తుంది. అర లీటరు బాటిల్ ధర రూ.8 ఉండగా రూ.10కి విక్రయిస్తే రూ.2 మాత్రమే లాభం వస్తుంది. బ్రాండెడ్‌ను పోలిన నకిలీ బాటిల్ లీటరు హోల్‌సేల్ ధర రూ.9.80, అరలీటరు రూ.4.50కి లభిస్తున్నాయి. వీటిని కూడా లీటరు రూ.20, అర లీటరు రూ.10కి విక్రయిస్తున్నారు. విపరీతమైన లాభం ఉండడంతో వ్యాపారులు లోకల్ వాటర్ బాటిళ్లనే ప్రయాణికులకు అంటగడుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్ల పరిధిలో 700కిపైగా దుకాణాలు న్నాయి. వీటిలో 400కుపైగా దుకాణాల్లో ఈ లోకల్ వాటర్ బాటిళ్ల విక్రయాలు సాగిస్తున్నారు. ఒక్కో దుకాణంలో రోజుకు 8 నుంచి 10 కేసుల వాటర్ బాటిళ్లను అమ్ముతున్నారు. ఒక్కో కేసు బాక్సుకు లీటర్ బాటిళ్లు 12, అరలీటరువి 24 చొప్పున ఉంటాయి. ఒక్కో దుకాణంలో రోజుకు సరాసరి 10 కేసుల లోకల్ వాటర్ బాటిళ్లు విక్రయించినా.. వాటిద్వారా ఎమ్మార్పీలోనే రూ.1440 అదనంగా ఆదాయం వస్తోంది. ఈలెక్కన ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 400 దుకాణాల్లోనూ సాగే లోకల్ వాటర్ బాటిళ్ల విక్రయాల ద్వారా రోజుకు రూ.5.76 లక్షలు ఆదాయం వస్తోంది. నాణ్యతలేని లోకల్ వాటర్ బాటిళ్ల ద్వారా ప్రయాణికుల ఆరోగ్యం, జేబును గుల్ల చేస్తూ వ్యాపారులు పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నకిలీ వ్యవహారం బహిరంగంగానే సాగుతున్నా ఆహార భద్రత, తూనికలు-కొలతల శాఖాధికారులు గానీ, ఆర్టీసీ యంత్రాంగంగానీ చర్యలు చేపట్టట్లేదు. నామమాత్రపు తనిఖీలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఈ నకిలీ దందాకు అడ్డుకట్ట వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



తనిఖీలు చేస్తాం

నకిలీ వాటర్ బాటిళ్లపై ప్రయాణికుల నుంచి ఫిర్యాదు అందలేదు. ఫిర్యాదులొస్తే కచ్చితంగా చర్యలు చేపడతాం. నెలవారీ తనిఖీల్లో దుకాణాల్లో ఐఎస్ఓ గుర్తింపు బాటిళ్ల మాత్రమే ఉన్నట్లు గుర్తించాం. మరోసారి దుకాణాలన్నింటినీ తనిఖీ చేసి, లోకల్ వాటర్ బాటిళ్లు విక్రయిస్తుంటే చర్యలు తీసుకుంటాం.

-నాగభూపాల్, డీఎం, అనంతపురం

← వాటర్ బాటిళ్లు కొనుగోలు చేస్తున్న ప్రయాణికులు



ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం



ఏడీసీసీ బ్యాంకులో అడ్డగోలు వ్యవహారాలు

అన్నీ సక్రమంగా ఉన్నా వీఆర్ఎస్..!

బెనిఫిట్స్, కుటుంబంలోని వారికి ఉద్యోగం

తొలగించిన ఉద్యోగి.. మళ్లీ విధుల్లోకి..

వైసీపీ హయాంలో అక్రమాలు

ముడుపులిస్తే.. ఓకే..!

గత వైసీపీ ప్రభుత్వంలో ఓ ఉద్యోగి అనారోగ్యం పేరుతో అక్రమ మార్గంలో మెడికల్ సర్టిఫికెట్ తీసుకుని, వీఆర్ఎస్ పొందారు. కుమారుడికి ఉద్యోగం ఇస్తే చాలనీ, బెనిఫిట్స్ అవసరం లేదని ఏడీసీసీ బ్యాంకు అధికారులకు లేఖ ఇచ్చారు. ఆ మేరకు 2022లో కొడుక్కి ఉద్యోగం ఇచ్చారు. తనకల్లు బ్రాంచ్‌లో విధుల్లో చేరాడు. తరువాత అధికారులకు వీఆర్ఎస్ ఉద్యోగి ఇచ్చిన లేఖను మాయం చేసి, సుమారు రూ.40 లక్షల వరకు బెనిఫిట్స్ కూడా తీసుకున్నాడు. ఇందుకోసం అధికారులకు రూ.20లక్షల వరకు ముడుపులు ముట్టజెప్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా రూ.6 లక్షల బెనిఫిట్స్ బకాయిలు చెల్లించేందుకు బ్యాంకులోని ఓ కీలక అధికారి ససేమిరా అనడంతో విషయం బయటకు పొక్కింది.

పెనుకొండ బ్రాంచ్‌లో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో ఓ ఉద్యోగి మంచానికే పరిమితమయ్యాడు. మెడికల్ బోర్డు కూడా అనారోగ్యాన్ని ధ్రువీకరించింది. ఆ ఉద్యోగికి వీఆర్ఎస్ ఇచ్చి, బెనిఫిట్స్ మాత్రమే అందించారు. కొడుక్కి ఉద్యోగం ఇవ్వాలని చేసిన విజ్ఞప్తిని అప్పట్లో ఏడీసీసీ బ్యాంకు అధికారులు తిరస్కరించారు. దీనిని బట్టి ముడుపులు ఇస్తే నిబంధనలు అడ్డురావని స్పష్టమవుతోంది.

ఓబుళదేవరచెరువు మండలంలోని ఓ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఒకే పట్టాదారు పాసుపుస్తకంపై రెండు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నట్లు తేలింది. ఉద్యోగం నుంచి తొలగించారు. ఆరు నెలలు తిరక్కుండానే మళ్లీ ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం ఆ ఉద్యోగి మడకశిర మండలంలోని బ్రాంచ్‌లో పనిచేస్తున్నాడు. ఉన్నతాధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు ముట్టజెప్పాడన్న ఆరోపణలు న్నాయి.



అనంతపురం క్లాక్‌టవర్, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఏడీసీసీ బ్యాంకు) అక్రమాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత వైసీపీ హయాంలో అడ్డగోలు వ్యవహారాలతో రూ.లక్షలు చేతులు మారాయి. ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేసి వసూలు చేశారని తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన లీలలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

అక్రమ మార్గంలో మెడికల్ ఇన్వాలిడేషన్

ఆరోగ్యం సక్రమంగా లేకపోయినా, మంచానికే పరిమితమైనా ఆ ఉద్యోగి స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు దరఖాస్తు చేసుకోవచ్చు. మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా ధ్రువీకరించుకుని, తదుపరి చర్యలు తీసుకోవాలి. 2022లో మెడికల్ ఇన్వాలిడేషన్‌కు కర్నూలులోని ప్రాంతీయ మెడికల్ బోర్డుకు అనంతపురం సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిపాదనలు పంపారు. సరైన కారణాలు, ఆరోగ్యం సక్రమంగా ఉందనే నెపంతో ఆ ప్రతిపాదనలు కర్నూలు రీజనల్ మెడికల్ బోర్డు తిప్పిపంపింది. అనంతపురంలో కొందరు వైద్యులకు ముడుపులు ముట్టజెప్పి, ధ్రువీకరించినట్లు అప్పట్లో ఏడీసీసీ బ్యాంకు లెటర్ హెడ్‌తో సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టి కోరం లేకపోయినా వారి మార్గంలో ఆమోదింపజేసుకున్నారు. ఆ ఉద్యోగి ఆరోగ్యంగా తిరుగుతూ బ్యాంకుకి తరచూ వచ్చివెళ్తున్నారని అక్కడ పనిచేస్తున్నవారు చర్చించుకుంటున్నారు.

ప్రేక్షక పాత్రలో అధికారులు

జిల్లాలోని సహకార బ్యాంకులు, సొసైటీలను నియంత్రించి, సక్రమ మార్గంలో నడిపించాల్సిన బాధ్యత జిల్లా సహకార శాఖ, నాబార్డు, ఆప్కాబ్ అధికారులపై ఉంటుంది. వారు ప్రేక్షకపాత్రలో ఉండిపోతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వారి తీరుపై అనుమానాలు తలెత్తుతున్నాయి. గతంలో వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై సహకార శాఖ అధికారులు విచారణ చేపట్టి, ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెబుతున్నా.. ఆచరణలో మాత్రం కనిపించట్లేదు.

పరిశీలిస్తాం

గతంలో ఉద్యోగుల వీఆర్ఎస్, తొలగింపుపై చర్చ వచ్చింది. అప్పట్లో ఉన్న అధికారులు ఎలా చేశారో... తెలీదు. వీఆర్ఎస్ పొందిన ఉద్యోగికి, కొడుక్కి ఉద్యోగంగానీ, బెనిఫిట్స్‌గానీ ఏదో ఒకటి మాత్రమే ఇవ్వాలి. రెండూ ఇస్తే నిబంధనలను అతిక్రమించడమే. ఒకసారి ఉద్యోగి చేసిన అక్రమాలను గుర్తించి తొలగిస్తే తిరిగి ఉద్యోగంలోకి తీసుకోకూడదు. తిరిగి ఉద్యోగంలోకి ఎలా తీసుకున్నారో పరిశీలిస్తాం. ఫిర్యాదులు వస్తే విచారణ చేసి, చర్యలకు ప్రభుత్వానికి నివేదిస్తా.



- సురేఖారాణి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ

క్రైం కార్నర్

నమ్మించి పిలిపించి.. గొంతుకోశారు

- వినోద్ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- అన్నదమ్ములిద్దరూ అరెస్ట్



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిబాబు, సీఐ, ఎస్ఐలు

రాయదుర్గం, మే 22(ఆంధ్రజ్యోతి): తమ ఇంటి మహిళల గురించి దుష్ప్రచారం చేస్తున్నాడనే కోపంతోనే వినోద్‌ను హత్య చేశారని డీఎస్పీ రవిబాబు వెల్లడించారు. ఇటీవల మండలంలోని కొంతానపల్లి వద్ద చింతచెట్టు కింద హత్యకు గురైన వినోద్ కేసును పోలీసులు ఛేదించారు. నిందితులను గురువారం అరెస్టు చేశారు. సర్కిల్ కార్యాల యంలో గురువారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. కొంతానపల్లి గ్రామానికి చెందిన వినోద్ సమీప బంధువులైన బోయ రమేష్, నాయకుల బొమ్మలింగ హత్య చేసినట్లు డీఎస్పీ రవిబాబు వెల్లడించారు. వివరాలు ఇలా కొంతానపల్లి గ్రామానికి చెందిన వినోద్ కొద్ది రోజుల నుంచి ఉద్దేశ్యపూర్వకంగా నిందితుల ఇంటి మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, వారి గురించి చెడుగా ప్రచారం చేస్తున్నాడు. దీనిని మనసులో పెట్టుకున్న అన్నదమ్ములైన రమేష్, బొమ్మలింగ.. వినోద్ పట్ల కోపాన్ని పెంచుకున్నారు. సమయం చూసి చంపాలని నిర్ణయించుకున్నారు. దీంతో 17న రాత్రి మద్యం సేవించిన వినోద్‌ను నమ్మించి రప్పించుకున్నారు. గ్రామ సమీపంలో ఉన్న తోటలోని చింత చెట్టు వద్ద మరింత మద్యాన్ని తాగించి వినోద్ స్పృహ కోల్పోయేలా చేశారు. అనంతరం వ్యూహం ప్రకారం వినోద్ గొంతుకు తాడు బిగించి పదునైన కొడవలితో గొంతు కోసి తలను వేరు చేశారు. శవంగా పడి ఉన్న వినోద్‌ను మరుసటి రోజు ఉదయం గుర్తించి పోలీసులు విచారణ ప్రారంభించారు. రాయదుర్గం మండలంలోని చదం రైల్వేగేట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా హత్య చేసిన బొమ్మలింగ, రమేష్ తచ్చాడుతూ పోలీసులకు దొరికిపోయారు. వీరి నుంచి కొడవలితో పాటు రెండు సెల్‌ఫోన్‌లు, నైలాన్‌తాడు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి తండ్రి బోయ ఆంజనేయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేట్రేగిపోతున్న కేబుల్ దొంగలు

- పది తోటల్లో విద్యుత్ వైరు చోరీ



పుల్లారెడ్డి, రమేష్ తోటల్లో కేబుల్‌వైరు కత్తిరించుకువెళ్లిన దొంగలు

యాడికి, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలో కేబుల్ దొంగలు పేట్రేగిపోతున్నారు. రాయలచెరువు పరిధిలోని పదిమంది రైతుల తోటల్లో బోరుబావుల వద్ద బుధవారం రాత్రి వైరును కోసుకుపోయారు. సుమారు 400 మీటర్ల వైరు చోరీ అయిందని బాధిత రైతులు పరిమి చరణ్, శివరాజ్, పుల్లారెడ్డి, రమేష్ తదితరులు తెలిపారు. పదే పదే చోరీలు జరుగుతున్నాయని, పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండటం లేదని వాపోయారు. దొంగలు వైరు కత్తిరించుకువెళ్లే సమయంలో మిగిలిన భాగం బోరుబావిలోకి పడిపోతే తమకు మరింత నష్టం జరుగుతోందని అన్నారు. బోరుబావిలోని పైపులను బయటకు తీసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాల్సి వస్తోందని, దీనికి రూ.20 వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల వ్యవధిలో పదుల సంఖ్యలో చోరీలు జరిగాయి. దొంగలను నియంత్రించకపోతే పంటలను ఎండబెట్టుకోవాల్సిన పరిస్థితులు వస్తాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆంధ్రా జట్టుకు దత్తా.. వినయ్



దత్తారెడ్డి, వినయ్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, మే 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా సీనియర్ క్రికెట్ జట్టుకు జిల్లా క్రీడాకారులు ఇద్దరు ఎంపికయ్యారు. ఈ నెల 29 నుంచి డెహ్రాడూన్‌లో జరిగే దేవ్‌భూమి గోల్డ్ క్రికెట్ నేషనల్ కప్ టోర్నమెంట్‌కు ఆంధ్రా క్రికెట్ జట్టు తరపున జిల్లా క్రీడాకారులు బి.వినయ్ కుమార్, ఎంకే దత్తారెడ్డి ఆడుతారు. వీరికి జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

25న అండర్-19 జట్టు ఎంపిక

జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న అనంతపూర్ స్పోర్ట్స్ అకాడమీ స్టేడియంలో జిల్లా అండర్-19 పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. 2006 సెప్టెంబరు 1వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలని సూచించారు.

అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక



ఆరేటి శివయ్య

అనంతపురం సెంట్రల్, మే 22(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ రసాయనశాస్త్ర విభాగంలో పీజీచేసిన డాక్టర్ ఆరేటి శివయ్య అంతర్జాతీయ సదస్సుకు ఎంపికయ్యారు. ఈ నెల 25 నుంచి 30వరకు జపాన్‌లో 19వ మ్యాక్రోసైక్లిక్ అండ్ సూపర్ మాలిక్యులర్ కెమిస్ట్రీ అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా రసాయన శాస్త్రవేత్తలతో నిర్వహించే ఈ సదస్సుకు మన దేశం నుంచి తాను ఎంపికయ్యానని శివయ్య గురువారం తెలిపారు. ఎస్కేయూలో ఎమ్మెస్సీ పూర్తిచేసి, ఐఐటీ ముంబయిలో పీహెచ్‌డీ అందుకున్న శివయ్య... ప్రస్తుతం సూరత్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైన సందర్భంగా డాక్టర్ శివయ్యను ఎస్కేయూ ప్రొఫెసర్లు, శాస్త్రీయ వర్గాలు, విద్యావేత్తలు అభినందించారు.

ఏఈఓ బదిలీల్లో ఇష్టారాజ్యం

- అన్యాయం జరిగిందని గ్రేడ్-1 ఏఈఓల ఆవేదన
- ఇతర కేడర్ల సిబ్బంది బదిలీల్లో సిఫార్సులకు ప్రాధాన్యం



అనంతపురం అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): ఏఈఓల బదిలీల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. వ్యవసాయ శాఖలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఏఈఓలు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, క్లాస్-4 సిబ్బందికి గురువారం జేడీఏ కార్యాలయంలో బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రిదాకా కౌన్సెలింగ్ కొనసాగింది. బదిలీల్లో పాదర్శకతకు పాతర వేశారన్న విమర్శలు వస్తున్నాయి. సిఫార్సులకు పెద్దపీట వేయడంతో తమకు తీరని అన్యాయం జరిగిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేడ్-1, గ్రేడ్-2 ఏఈఓల బదిలీల్లోనూ వింత వైఖరిని అవలంబించారన్న విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-1, గ్రేడ్-2 ఏఈఓలు పనిచేస్తున్నారు. గతంలో గ్రేడ్ -1 స్థానంలో గ్రేడ్-2 ఏఈఓలు, గ్రేడ్-2 స్థానంలో గ్రేడ్-1 ఏఈఓలను నియమించారు. తాజా బదిలీల్లో ఏఏ స్థానాల వారిని ఆయా స్థానాల్లోనే నియమించాలని వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. నిబంధనల మేరకు బదిలీల ప్రక్రియకు ముందస్తుగానే గ్రేడ్-1 స్థానాల్లో గ్రేడ్ -1 ఏఈఓలను, అలాగే గ్రేడ్-2 స్థానాల్లో సంబంధిత ఏఈఓలను పంపించి, ఆ తర్వాత బదిలీల ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు నేరుగా అందరినీ కౌన్సెలింగ్‌కు పిలిచారు. ఇందులో ఐదేళ్లు పూర్తికాని ఏఈఓలు ఉండటం గమనార్హం. ఐదేళ్లు పూర్తికాకపోయినా తమ పేర్లను బదిలీల జాబితాలో చేర్చి తీరని అన్యాయం చేశారంటూ కొందరు గ్రేడ్-1 ఏఈఓలు ఉమ్మడి జిల్లాల జేడీఏల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అవేవీ పట్టించుకోకుండా కౌన్సెలింగ్‌ను కొనసాగించడంతో బాధిత ఏఈఓలు ఏం చేయలో తోచక కొట్టుమిట్టాడుతున్నారు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు బాధిత సిబ్బందికి ఏ మేరకు న్యాయం చేస్తారో వేచి చూడాల్సిందే.

48 గంటల్లో 1056 దరఖాస్తులు

అనంతపురం విద్య, మే 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలకు 48 గంటల్లోనే వెయ్యికి పైగా దరఖాస్తులు వచ్చాయి. గురువారం రాత్రికి 1,056 వరకూ వచ్చినట్లు విద్యాశాఖ వర్గాల ద్వారా తెలిసింది. బదిలీల్లో భాగంగా గ్రేడ్2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తుకు రెండు రోజులు మాత్రమే గడువు ఇచ్చారు. బుధ, గురువారాల్లో గ్రేడ్ -2 హెచ్ఎంల నుంచి 184 దరఖాస్తులు వచ్చాయి. చివరిరోజు కావడంతో చాలా మంది హెచ్ఎంలు గురువారం శారదా స్కూల్‌లోని కౌంటర్ వద్దకు వచ్చిన దరఖాస్తులు సమర్పించారు. గ్రేడ్-2 హెచ్ఎంల నుంచి 184 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 5 ఏళ్లు పూర్తి చేసుకుని, తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారు 26 మంది, రిక్వెస్ట్ బదిలీ కింద మరో 158 ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ల నుంచి 872 దరఖాస్తులు వచ్చాయి. వీరికి మరో 2 రోజులు గడువు ఉంది. దీంతో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.



వెబెక్స్‌కు హాజరైన డీఈఓ , ఇతర అధికారులు

సర్‌ప్లస్, సీనియారిటీ లిస్టు ప్రకటించండి

- డీఈఓకు వినతుల వెల్లువ

అనంతపురం విద్య, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలు, హేతుబద్ధీకరణలో తలెత్తుతున్న సమస్యలపై వెంటనే స్పష్టత ఇవ్వాలని పలు సంఘాల నాయకులు డీఈఓను కోరారు. పలు సంఘాల నాయకులు వేర్వేరుగా గురువారం శారదాస్కూల్‌లో ఉన్న డీఈఓ ప్రసాద్‌బాబును కలిశారు. టీచర్ల సర్ ప్లస్ వివరాలు, హేతుబద్ధీకరణ వివరాలు, సీనియారిటీ లిస్టుల సమస్యలపై స్పష్టత ఇవ్వాలని వినతిపత్రాలు అందజేశారు.

సర్‌ప్లస్ టీచర్ల వివరాలు ఇవ్వండి: ఏపీటీఎఫ్

'చాలా మండలాల్లో ఏ స్కూల్‌లో ఏ టీచర్ సర్‌ప్లస్ అయ్యారోనన్న సమాచారం కూడా లేదు. బదిలీలకు సంబంధించి అన్ని సబ్జెక్టుల టీచర్లు, ఎస్‌జీటీల ఫైనల్ సీనియారిటీ జాబితా బహిర్గతం చేయాలి. డీఈఓ పూల్‌లో ఉన్న ఎల్పీలు, పీఈటీలు బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలా..? వద్దా అన్న దాని ఎవరూ స్పష్టత ఇవ్వడం లేదు. బదిలీలు, హేతుబద్ధీకరణకు సంబంధించిన సందేహాల నివృత్తికి జిల్లాలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలి' అంటూ ఏపీటీఎఫ్ నాయకులు డీఈఓకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసనాయక్, రవీంద్ర, ఆంజనేయులు వజీర్, సాయినాథ్‌రెడ్డి, ఫక్రుద్దీన్, మల్లి, హుస్సేన్ పాల్గొన్నారు.



డీఈఓకు ఏపీటీఎఫ్ నేతల వినతి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీనియారిటీ లిస్టు బయటపెట్టండి: యూటీఎఫ్

'టీచర్ల సీనియారిటీ జాబితాలు బయటపెట్టాలి. గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల అడిక్వసీ ప్రకటించాలన్నారు. ఆ తర్వాతే వాళ్లకు ప్రమోషన్లు ఇవ్వాలి. హేతుబద్ధీకరణ చేసిన తర్వాత స్కూళ్లు, టీచర్ పోస్టుల వివరాలను అధికారికంగా ప్రకటించాలి. 5 ఏళ్లు, 8 ఏళ్లు పూర్తి చేసుకున్న హెచ్ఎంలు, టీచర్ల వివరాలను సైతం విడుదల చేయాలి' అని యూటీఎఫ్ నాయకులు డీఈఓ వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గోవిందరాజులు, లింగమయ్య, రమణయ్య, ప్రమీల, సుబ్బరాయుడు, దేవేంద్రమ్మ, నాగేంద్ర, కోటేశ్వరప్ప, వెంకటేశ్వర నాయుడు, జాకీర్ హుస్సేన్, రమేష్, రామాంజినేయులు, అనిల్, శివరుద్రప్ప పాల్గొన్నారు.

శభాష్.. మహేష్..

- భారత సాఫ్ట్‌బాల్ జట్టుకు జిల్లావాసి ఎంపిక



అనంతపురం క్లాక్‌టవర్, మే 22 (ఆంధ్రజ్యోతి): భారత సాఫ్ట్‌బాల్ జట్టుకు జిల్లాకు చెందిన మహేష్ ఎంపికయ్యాడు. అనంతపురం శివారు ఇటుకలపల్లికి చెందిన ఎస్కే యూనివర్శిటీ ఉద్యోగి శివశంకర్, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు మహేష్. ఇప్పటి వరకు 26 జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించి 11 స్వర్ణ, 5 కాంస్య, 8 రజత పతకాలను సాధించాడు. తాజాగా భారత జట్టులో స్థానం సంపాదించాడు. జూన్ 2వ తేదీ నుంచి థాయ్‌ల్యాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగే ఆసియా అంతర్జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు భారత్ తరపున మహేష్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. దీంతో మహేష్‌ను కోచ్‌లు, క్రీడాకారులు అభినందించారు.

ఎండీయూ వాహనాల రద్దును ఉపసంహరించుకోవాలి

అనంతపురం కల్చరల్, మే 22(ఆంధ్రజ్యోతి): ఇళ్ల వద్దకు నిత్యావసరాలు పంపిణీ చేసే ఎండీయూ వాహనాల వ్యవస్థ రద్దు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. సరుకుల పంపిణీ నిర్వహణలో లోపాలను సరిదిద్ది, ఎండీయూ వ్యవస్థను మరింత మెరుగుపరచాలని కోరారు. ఎండీయూ వ్యవస్థ రద్దుతో సదరు వాహనాల డ్రైవర్లకు ఉపాధిలేకుండా పోతుందన్నారు.

రేపు శాస్త్రీయ సంగీత కచేరి

అనంతపురం కల్చరల్, మే 22(ఆంధ్రజ్యోతి): మొదటి రోడ్డులోని త్యాగరాజ సంగీత సభలో శనివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9.15 గంటల వరకు శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహిస్తున్నామని సంగీత సభ అధ్యక్షుడు సంపత్ కుమార్ గురువారం తెలిపారు. ఆలిండియా రేడియో విశ్రాంత డిప్యూటి డైరెక్టర్ జనరల్, గాన కళాభూషణ డాక్టర్ వాగీష్ కృష్ణ, ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఖ్యాతి గడించిన వయోలిన్ కళాకారుడు పవ్బుజ్ఞానదేవ్, మృదంగం కళాకారుడు పెరవలి జయభాస్కర్ హాజరై సంగీత కచేరి నిర్వహిస్తారని తెలిపారు.

తగ్గిన చీనీ ధర

- టన్ను గరిష్ఠంగా రూ.38వేలతో అమ్మకం

అనంతపురంరూరల్, మే22(ఆంధ్రజ్యోతి):అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీ ధరలు తగ్గాయి. వారంరోజులుగా పెరుగుతూ వచ్చిన ధర అమాంతం పడిపోయింది. మార్కెట్ నుంచి కాయలు ఎగుమతి అయ్యే ప్రాంతాల్లో పెద్దఎత్తున వర్షాలు కురుస్తుండటం ధర తగ్గుదలకు ప్రధాన కారణమన్న అభిప్రాయాలు సంబంధిత వర్గాల ద్వారా వినిపిస్తున్నాయి. నైరుతి రుతుపవనాల రాకతో రాబోవు రోజుల్లో ధర మరింత తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ధర అమాంతం పడిపోవడంతో రైతులు ఆందోళనలో పడ్డారు. గురువారం టన్ను గరిష్ఠంగా రూ.38,120, కనిష్ఠంగా రూ.4,100, సరాసరి రూ.22వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 772 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

అనంతకు విధుశేఖర భారతీస్వామి



శంకరమఠానికి చేరుకుంటున్న విధుశేఖర భారతీ స్వామి

అనంతపురం కల్చరల్, మే 22(ఆంధ్రజ్యోతి): శృంగేరి శారదాపీఠం దక్షిణాధికారి విధుశేఖర భారతీస్వామి గురువారం సాయంత్రం అనంతపురం విచ్చేశారు. శారదానగర్‌లోని శంకరమఠం వద్ద స్వామివారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ శంకరమఠంలో గణనాథుడు, శంకరాచార్యులు, శారదామాతను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చంద్రమౌళీశ్వరస్వామికి పూజలు చేశారు. తదనంతరం ఆలయాల విశిష్టత గురించి భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. కార్యక్రమంలో మఠం కార్యనిర్వహణాధికారి సత్యప్రసాద్, మోహన్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రభంజనం

- రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన మోక్షిత్

తిరుపతి(విద్య), మే 22(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ - 2025లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకుతోపాటు విశ్వం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... 6, 9 తరగతుల ప్రవేశాలకుగాను ఏప్రిల్ 5న జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా 9వ తరగతి విభాగంలో వి. మోక్షిత్ మొత్తం 400 మార్కులకుగాను 370 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. 6వ తరగతి విభాగంలో 300 మార్కులకుగాను హృతిక్ రాయల్ 281 మార్కులు, వి.నిహార్ 275, సోహిని 270 మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. వీరితోపాటు రసజ్ఞ, జీవన్ సాయిరెడ్డి, ఆర్యన్‌రెడ్డి, భువనేష్, లోహిత్, మహీధర్, అశ్విన్ తదితరులు రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు సాధించారు. గురువారం తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వి.మోక్షిత్ తదితర విద్యార్థులను అభినందించారు. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు గణితంలో 150/150, ఇంటెలిజెన్స్ టెస్ట్‌లో 50/50 మార్కులు పొంది రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారని వెల్లడించారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలువేస్తూ అత్యుత్తమ శిక్షణ ఇస్తున్న అధ్యాపక బృందానికి, ఉన్నత విజయాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. సమాచారం కావాల్సిన వారు 8688888802/ 9399976999లలో సంప్రదించాలని సూచించారు.



మోక్షిత్‌ను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

ఒంటెపై నెట్టికంటి వైభవం

కసాపురంలో ఘనంగా హనుమజ్జయంతి



పుష్పాలంకారాలలో నెట్టికంటి మూల విరాట్టు

గుంతకల్లు, మే22(ఆంధ్రజ్యోతి): శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి ఒంటెపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కసాపురంలో వెలసిన స్వామివారికి ఒంటె వాహనసేవ వైభవంగా నిర్వహించారు. హనుమజ్జయంతి గురువారం కసాపురంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నెట్టికంటి మూల విరాట్టుకు అభిషేకాలు నిర్వహించి, పుష్పాలంకారాలు చేశారు. స్వర్ణకవచ ధారణ చేసి, తోమాలతో అలంకరించారు. ఆలయంలో ఉదయం 9 గంటలకు శ్రీరామ పట్టాభిషేకం, బలిహరణ పూర్ణాహుతి, కలశోద్వాసన, మహదాశీర్వాద కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆరాధన, వేద, సుందరకాండ, మన్యుసూక్త పారాయణాలు, హోమాలు, శ్రీరామ ఆంజనేయుల మూలమంత్ర అనుష్టానాలను చేపట్టారు. సాయంత్రం ఆలయ దక్షిణ గోపురం ఎదుట ఉష్ట్ర (ఒంటె) వాహనంపై నెట్టికంటి ఉత్సవ విగ్రహాన్ని ఆశీనులు గావించి, సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ప్రాకారోత్సవంలో పెద్దఎత్తున పాల్గొన్నారు.



ఆంజనేయుడికి ప్రాకారోత్సవాన్ని నిర్వహిస్తున్న అధికారులు

మురడిలో...



పూజలందుకున్న ఆంజనేయస్వామి

డీ.హీరేహాళ్, మే 22(ఆంధ్రజ్యోతి): మురడి ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో తెల్లవారుజామున సుప్రభాత సేవ చేశారు. స్వామివారికి కుంకుమార్చన, బిల్వార్చన, సహస్రనామార్చన ఇతర పూజాకార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూలు, ఆభరణాలతో అలంకరించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కుటుంబసమేతంగా.. స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

గవిమఠం భూముల వేలం ఆపాలి: సీపీఐ



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం విద్య, మే 22(ఆంధ్రజ్యోతి): విడపనకల్లు మండలం కొత్తపేట గ్రామంలోని గవిమఠం భూముల వేలం వెంటనే ఆపాలని సీపీఐ నాయకులు.. డీఆర్వో మలోలను కోరారు. గురువారం సీపీఐ జిల్లాకార్యదర్శి జాఫర్, ఇతర నేతలు.. డీఆర్వోను కలిశారు. వారు మాట్లాడుతూ... సుమారు 30 ఏళ్ల కిందట సర్వే నంబరు 590 బీలోని 12.57 ఎకరాలు, 835 సర్వే నంబరులోని 39.63 ఎకరాలను సీపీఐ ఆధ్వర్యంలో అర్హులైన పేదలకు పంచారన్నారు. వాటి గుత్తలు నేటికీ రైతులు చెల్లిస్తున్నారని తెలిపారు. దేవదాయశాఖ ఉన్నఫలంగా ఈనెల 23న భూముల వేలంపాటకు సిద్ధమైందన్నారు. మూడు దశాబ్దాలుగా సాగులో ఉంటున్న రైతులకు అవకాశం కల్పించాలనీ, భూముల క్రమబద్ధీకరణ చేయాలన్నారు. 23న జరిగే వేలంపాట రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కేశవరెడ్డి, నాయకులు చంద్రాయుడు, రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీలో 99శాతం మంది పాస్

అనంతపురం సెంట్రల్, మే 22(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ తృతీయ సంవత్సరం ఆరో సెమిస్టర్ పరీక్షల్లో 98.57 శాతం మంది విద్యార్థులు పాస్ అయ్యారు. ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అనిత.. రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబుతో కలిసి ఫలితాలను గురువారం విడుదల చేశారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. బీఏ, బీటీఏ, బీసీఏ, బీకామ్, బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్‌లో ఆరో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 6,361 మంది విద్యార్థులు రాయగా.. 6,270 మంది పాసయ్యారని తెలిపారు. దీంతో 98.57 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పేర్కొన్నారు. 91 మంది మాత్రమే ఫెయిలయ్యారన్నారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్‌లో ప్రదర్శించామని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల విభాగ సంచాలకుడు ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జిమినేషన్స్ డాక్టర్ లోకేష్, అధికారులు మారుతి, సాయిశివ, ఫిజికల్ డైరెక్టర్ జెస్సీ, కదిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్మిత పాల్గొన్నారు.

జెండామోసిన కార్యకర్తలకు అన్యాయం జరగదు

● పరిటాల రవి స్ఫూర్తితో స్థానిక సంస్థలను ఏకగ్రీవం చేసుకుందాం ● మినీ మహానాడులో ఎమ్మెల్యే పరిటాల సునీత




సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల సునీత, మినీమహానాడుకు వచ్చిన కార్యకర్తలు, నాయకులతో ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, మే 22(ఆంధ్రజ్యోతి): పసుపు జెండా మోసి పార్టీ కోసం కష్టపడిన ఏ ఒక్క కార్యకర్తకు అన్యాయం జరగదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని నసనకోట తిరుమల దేవర దేవస్థానం ప్రాంగణంలో గురువారం మినిమహానాడు పండుగ వాతావరణంలో జరిగింది. కార్యక్రమంలో టీడీపీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, నియోజకవర్గ అబ్జర్వర్ క్రిష్ణమ్మ, మండలాల నాయకులు పాల్గొన్నారు. ముందుగా పరిటాల సునీత తిరుమల దేవర, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం టీడీపీ జెండాను ఆవిష్కరించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్రచిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి మహానాడును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేదిక మీద తాను మాట్లాడుతున్నానంటే కారణం ఎన్టీఆర్, సీఎం చంద్రబాబునాయుడే అన్నారు. పరిటాల రవీంద్రను ఎన్టీఆర్ పార్టీలోకి ఆహ్వానించారని, ఆయన పార్టీని ఎంతోబలంగా తీర్చిదిద్దారన్నారు. తనకు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఐదేళ్లపాటు మంత్రిగా అవకాశం ఇచ్చింది చంద్రబాబే అన్నారు. కార్యకర్తల కష్టం వల్లనే తనకు భారీ మెజారిటీ వచ్చిందన్నారు. తన గెలుపు కోసం కష్టపడిన ఏ నాయకుడు, కార్యకర్తను మరువనని తెలిపారు. ఇప్పటికే కొందరికి న్యాయం చేశానని, నాలుగేళ్లలో అందరికీ న్యాయం చేస్తా అన్నారు. గ్రామాల్లో జరిగే చిన్నచిన్న విషయాలను మనసులో పెట్టుకోవద్దని, అంతా సమష్టిగా పనిచేయాలన్నారు. తోపుదుర్తి సోదరుల వల్ల మన కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా ఎన్నో ఇబ్బందులుపడ్డారని, వారు చేసిన దౌర్జన్యాలు ఎదుర్కొని నిలబడ్డామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. అప్పట్లో పరిటాల రవీంద్ర జిల్లాలో అన్నిప్రాంతాల్లో స్థానిక సంస్థలను ఏకగ్రీవం చేశారని, అదే స్ఫూర్తిగా పనిచేద్దామన్నారు. అబ్జర్వర్ క్రిష్ణమ్మ మాట్లాడుతూ.. పరిటాల రవి స్ఫూర్తితో పనిచేయాలని, అనంతపురం జిల్లా టీడీపీ పేరుతో చెబితే గుర్తుకు వచ్చేది పరిటాల రవీంద్రే అన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీని ఏ విధంగా ఎదుర్కొని నిలబడ్డారో మనం కూడా అదే స్ఫూర్తితో పనిచేద్దామన్నారు. జిల్లా అధ్యక్షుడు అంజనప్ప మాట్లాడుతూ..మినిమహానాడులో తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తులో అమలు చేసేలా పనిచేయాలన్నారు. మన అధినేత కార్యకర్తల సంక్షేమం గురించి ఆలోచిస్తారని స్పష్టం చేశారు.

పవనపుత్రా.. పాహిమాం

● ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు
● కిటకిటలాడిన ఆలయాలు






కోర్టురోడ్డులోని వరదాంజనేయస్వామి, పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అభయాంజనేయస్వామి ఆలయంలో కలెక్టర్ కుటుంబ సభ్యులు, హెచ్చెల్సీ కాలనీలో ఆంజనేయస్వామి

అనంతపురం కల్చరల్, మే 22(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి పర్వదిన వేడుకలను గురువారం జిల్లావాసులు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి హనుమాన్ ఆలయం భక్తులతో కిటకిటలాడడంతోపాటు ప్రత్యేక పూజాకార్యక్రమాలతో అలరారింది. హనుమద్ వ్రతాలు, ప్రత్యేక అలంకార సేవలు, ఆకుపూజలు, అన్నదాన కార్యక్రమాలతోపాటు పలు ఆలయాల్లో శాంతి హోమాలను నిర్వహించారు. సోములదొడ్డి వద్ద గల అభయాంజనేయస్వామి దేవాలయంలో కలెక్టర్ వినోద్‌కుమార్ కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. కోర్టురోడ్డులోని వరదాంజనేయస్వామి దేవాలయంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. హౌసింగ్ బోర్డులోని భక్తాంజనేయస్వామి దేవాలయం, కక్కలపల్లి కాలనీ ప్రజాశక్తినగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి, పాతూరులోని మూలాంజనేయస్వామి, మండిఆంజనేయస్వామి, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, నాల్గవరోడ్డులోని కసాపురం ఆంజనేయస్వామి, ఎర్రనేల కొట్టాలలోని అభయాంజనేయస్వామి, రెవెన్యూ కాలనీ రామాలయం, హెచ్చెల్సీ కాలనీ వలీస్వామి ఆశ్రమం, శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమం, మారుతీనగర్ అభయాంజనేయస్వామి, ఐదోరోడ్డులోని పంచముఖాంజనేయస్వామి తదితర ప్రాంతాల్లో స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు చేసి విశేష పూజలు నిర్వహించారు.

●రాప్తాడు: మండలంలోని హంపాపురం సమీపాన గల మౌనగిరి హనుమాన్ క్షేత్రంలో హనుజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. మౌనగిరి వ్యవస్థాపకుడు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో 39 అడుగుల హనుమాన్ విగ్రహానికి ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అఖండ భజనలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.



మౌనగిరిలో ప్రత్యేక అలంకరణలో 39 అడుగుల హనుమాన్ విగ్రహం

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు

ఆత్మకూరు, మే 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఒంగోలు జాతి ఎద్దులు రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 14 జతలు ఒంగోలు జాతి ఎద్దులు పోటీలకు వచ్చాయి. ఉత్సాహంగా జరిగిన రాతిదూలం పోటీలకు జిల్లా నలుమూల నుంచి వేలాది మంది రైతులు తరలి వచ్చారు. పోటాపోటీగా జరిగిన పోటీలలో మొదటి బహుమతిని గద్వాల్ జిల్లా తాండ్రపాడుకు చెందిన వరలక్ష్మి ఎద్దులు రూ.40 వేలు గెలుపొందాయి. రెండో బహుమతిని కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన శశాంక శ్రేయ ఎద్దులు రూ.30వేలు దక్కించుకున్నాయి. మూడో బహుమతి గద్వాల్ జిల్లా కంచపాడుకు చెందిన ఆంజనేయరెడ్డి ఎద్దులు రూ. 20వేలు గెలుపొందాయి. నాలుగో బహుమతి రూ.10వేలు ఆత్మకూరుకు చెంది విశ్వనాథరెడ్డి ఎద్దులు గెలుచుకున్నాయి. ఇంకా పలు బహుమతులను ఎద్దులు గెలుపొందాయి. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



రాతి దూలాన్ని లాగుతున్న ఒంగోలు గిత్తలు

కలెక్టర్ ఆదేశాలను పాటించాలి



బస్టాండు పరిసరాలను పరిశీలిస్తున్న జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్లలో పరిశుభ్రతపై జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ చేసిన ఆదేశాలను తప్పకుండా పాటించేలా చర్యలు చేపట్టాలని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు అన్నారు. ఈ నెల 20న అనంతపురం ఆర్టీసీ బస్టాండును కలెక్టర్ ఆకస్మిక తనిఖీచేసి అపరిశుభ్రత గురించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు పరిశుభ్రత పాటించకపోతే జరిమానాలు విధిస్తామని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం జోనల్ చైర్మన్ పూల నాగరాజు బస్టాండు పరిసరాలను సందర్శించారు. అనంతరం ఆర్టీసీ జిల్లా అధికారులతో తన చాంబర్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ... కలెక్టర్ ఆదేశాలమేరకు ఎలాంటి అపరిశుభ్రతకు తావులేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని, డీఎం నాగభూపాల్, ఎస్ఐ దండు నగేష్ పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి..

అనంతపురం క్రైం,మే22(ఆంధ్రజ్యోతి) :నగర శివారులో బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. నగరంలోని నాలుగోరోడ్డుకు చెందిన చాకలి మురళి (35) హైవేలోని బిర్యానీ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున ఓ పెళ్లికి వెళ్లి తిరిగి బైక్‌లో వస్తుండగా బళ్లారి బైపాస్‌లో అదుపు తప్పి కింద పడటంతో తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఐజీ లేఅవుట్‌కు స్థల పరిశీలన



రాచానపల్లి సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ శివనారాయణశర్మ

అనంతపురంరూరల్,మే22(ఆంధ్రజ్యోతి): అహుడా ఎంఐజీ కొత్త లేఅవుట్ కోసం మండలంలోని రాచానపల్లి లో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ స్థల పరిశీలన చేపట్టారు. గురువారం అహుడా, రెవెన్యూ అధికారులతో కలసి రాచానపల్లి గ్రామ పరిధిలోని ఓ ప్రైవేట్ స్కూల్ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో అహుడా అధికారులతోపాటు వీఆర్వో వెంకటనరసయ్య, సర్వే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల వేటగాళ్ల అరెస్టు

అనంతపురం న్యూటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం రేంజ్ పరిధి బుక్కరాయసముద్రం గాంధీనగర్ సమీపాన వన్యప్రాణుల వేటకు వెళ్తున్న వారిని అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. శివ, పుల్లయ్యను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. వారిపై జరిమానా వేయనున్నారు. వేటగాళ్లను మంగళవారమే అదుపులోకి తీసుకున్నా సిబ్బంది గోప్యంగా ఉంచారు. బుక్కరాయసముద్రం సర్పంచ్‌తో పాటు ఇతర నాయకులు కార్యాలయానికి రావడంతో విషయం బయటకు పొక్కింది.

సత్తాచాటిన మాస్టర్స్ సైనిక్ విద్యార్థులు

సైనిక్ స్కూల్‌కు 24 మంది విద్యార్థుల అర్హత



అనంతపురంరూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మాస్టర్స్ సైనిక్ అకాడమీ విద్యార్థులు సత్తాచాటారు. 24 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఈ సందర్భంగా అకాడమి డైరెక్టర్ కుపేంద్ర మాట్లాడుతూ..గత నెల 5న ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష జరిగిందన్నారు. ఇందులో 24 మంది విద్యార్థులు కలికిరి, కొడుగు, కజకూటం సైనిక్ స్కూళ్లకు అర్హత సాధించారని తెలిపారు. అన్విత్ చౌదరి, అన్విత, ప్రణేశ్వర్, లిఖిజా, జిగ్నాస, రావియాక్షిత్, నవ్యశ్రీ, మహీధర్, నిఖిలేశ్వర్, గవిరెడ్డి పామిరెడ్డి ఉత్తమ మార్కులు సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులు అర్హత సాధించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

న్యూస్ బాక్స్

పార్కింగ్‌ను పదిరోజుల్లో పూర్తిచేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురంటౌన్, మే22 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తున్న మల్టీలెవల్ పార్కింగ్‌ను పదిరోజులలో పూర్తిచేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నేషనల్ క్లీన్‌ఎయిర్ ప్రోగ్రామ్‌పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ కింద చేపడుతున్న పనులలో పురోగతి వేగంగా కనిపించాలన్నారు. ఆస్పత్రిలో వాహనాల పార్కింగ్ సమస్య తీర్చాలని, పెద్దపెద్ద నగరాలలో ఏర్పాటు చేసే మల్టీలెవల్ పార్కింగ్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పనులు మొదలు పెట్టారని పదిరోజులలో ఈనిర్మాణం పూర్తి కావాలని సూచించారు. రాంనగర్ బ్రిడ్జి దగ్గర గ్రీనరీ అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయించాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ బాలరాజు, ఎస్ఈ చంద్రశేఖరరెడ్డి, డీటీసీ వీర్రాజు, ఈఈ, షాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 22(ఆంధ్రజ్యోతి): అనేక విషయాల్లో రిజర్వేషన్ ఉద్యోగులు సతమతమవుతున్నారని, వాటిపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను కోరామని ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశామని తెలిపారు. అదేవిధంగా ఇటీవల కమిషన్ చైర్మన్‌గా నూతన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఘనంగా సన్మానించి, ఎస్సీ సామాజిక వర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించామన్నారు. కార్యక్రమంలో నాయకులు గురుప్రసాద్, ఓబుళపతి, ఎల్లన్న, నగేష్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

బదిలీల్లో సిబ్బందికి న్యాయం చేయండి



డీఎఫ్‌ఓతో చర్చిస్తున్న యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున

అనంతపురం న్యూటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో సిబ్బందికి న్యాయం చేయాలని జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ల సంఘం ఆధ్వర్యంలో డీఎఫ్ఓ విఘ్నేష్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి న్యాయం చేయాలన్నారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ.. నిబంధనలకు లోబడి బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మారెప్ప, ప్రధాన కార్యదర్శి నీలవేణి పాల్గొన్నారు.

ఈఏపీసెట్‌కు 3,381 మంది హాజరు

అనంతపురం సెంట్రల్, మే 22(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీసెట్-2025 పరీక్షలకు గురువారం 3,381 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ పరీక్షలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన తొమ్మిది కేంద్రాల్లో 3,530 మంది విద్యార్థులకుగాను 3,381 మంది పరీక్షలు రాశారన్నారు.

నిత్యజీవితంలో యోగా భాగం కావాలి

ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు

అనంతపురం సెంట్రల్, మే 22(ఆంధ్రజ్యోతి): ఉరుకులు, పరుగుల జీవన విధానంతో భౌతికంగా, మానసికంగా ప్రశాంతతను, ఆరోగ్యాన్ని కోల్పోతున్న నేపథ్యంలో నిత్య జీవితంలో యోగా భాగం కావాల్సిన అవసరముందని ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు పేర్కొన్నారు. గురువారం ఎస్కేయూలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర అధ్యక్షతన యోగా ర్యాలీ నిర్వహించారు. కళాశాలనుంచి ప్రధాన ముఖద్వారం వరకు సాగిన ర్యాలీని రిజిస్ట్రార్ రమేష్ బాబు ప్రారంభించి మాట్లాడారు. అన్ని ప్రాంతాల ప్రజల జీవితంలో యోగాను భాగస్వామ్యం చేసేలా సీఎం నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో యోగాంధ్ర-2025 వారోత్సవాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ క్రిష్ణకుమారి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జెర్సీ, ప్రొఫెసర్ శోభలత, ఎన్ఎస్ఎస్ పీఓ ధనుంజయ, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై ఉపాధి కూలీలకు అవగాహన

రామగిరి, మే 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులకు వెళ్లిన కూలీలకు ఎంపీడీఓ కమలాబాయి యోగా ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. గురువారం రామగిరిలో ఉపాధి హామీ పనుల వద్ద కూలీలతో యోగా చేయించి దాని వల్ల ఆరోగ్యం, మానసిక ప్రశాంతత గురించి వివరించారు. ఆమె వెంట ఏపీఓ శంకర్, జేఈ జయరామిరెడ్డి, టీఏ రామాంజి తదితరులు పాల్గొన్నారు.

● చెన్నేకొత్తపల్లి : క్రమతప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతోపాటు ప్రశాంతత పొందవచ్చని ఎంపీడీఓ బాలకృష్ణుడు పేర్కొన్నారు. సిద్ధిసమాధియోగ గురూజీ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో పలు యోగాసనాలు చేయించారు. ఈ నెల 21వతేదీ నుంచి జూన్ 21వతేదీ వరకు యోగాంధ్ర మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ అశోక్‌నాయక్, ఏఓ శ్రీదేవి, సచివాలయ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో యోగా చేయిస్తున్న ఎంపీడీఓ

ప్రజాశక్తి కాలనీకి విద్యుత్ సరఫరా..!

40 గంటల తరువాత పునరుద్ధరణ



నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

అనంతపురంరూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కక్కలపల్లి గ్రామ పరిధిలోని ప్రజాశక్తి కాలనీకి ఎట్టకేలకు విద్యుత్ సరఫరా అయింది. దాదాపు 40 గంటల తరువాత స్థానికుల విద్యుత్ నిరీక్షణకు తెర పడింది. ప్రజాశక్తి కాలనీ పరిధిలోని సగం కాలనీకి బుధవారం తెల్లవారు జామున విద్యుత్ సరఫరా నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరా చర్యలు తీసుకోవడంతో నిర్లక్ష్యం ప్రదర్శిస్తూనే వచ్చారు. అదే రోజు సాయంత్ర సమయంలో పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అది కూడా ఏర్పాటు చేయడంలోనే పనిచేయకుండా పోయింది. దీంతో స్థానికులు చీకట్లోనే మగ్గారు. ఉదాయాన్నయినా విద్యుత్ సరఫరా చేస్తారని ఎదురు చూశారు. అది కూడా జరగలేదు. మళ్లీ సాయంత్ర సమయంలో సంబంధిత ఏఈ కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి తీసుకు వచ్చి వెంటనే ఏర్పాటు చేయాలని విద్యుత్ సిబ్బందికి సూచించి వెళ్లారు. సిబ్బంది పనితీరులో ఎలాంటి మార్పు కనిపించలేదు. ట్రాన్స్‌ఫార్మర్ లిఫ్ట్ చేసేందుకు ట్రిగర్ రాలేదంటూ కాలం వెళ్లదీశారు. ఇలా దాదాపు మూడు గంటల సమయాన్ని గడిపేశారు. 8 గంటల సమయంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. రాత్రి 9:30 గంటల సమయంలో కాలనీలోని ఇళ్లకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో రఘు విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

అనంతపురం విద్య, మే 22(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల ఫలితాల్లో రఘు సైనిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు డైరెక్టర్లు రాఘవేంద్ర, గురుప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. అనంతరం డైరెక్టర్లు మాట్లాడుతూ.. ఏప్రిల్ 5న సైనిక్ స్కూల్ పరీక్షలు జరిగాయన్నారు. యువకిరణ్ 280 మార్కులు, హరిసాయి 279, లిఖిత్ కుమార్‌రెడ్డి 278, నేహశ్రీ, క్రితికశ్రీ 276, కావ్యశ్రీ 271, మోక్షిత్‌రెడ్డి 268, భవిత 266, అద్వైత 262, యగ్నిత 260, సాత్విక్ రెడ్డి 258, ఆశిష్ చౌదరి 255, అనీస్,మోక్షిత్ సుబ్రహ్మణ్యం 253, పునీత్ సింహ 252, రోషిని 251, యువరాజ్ 250 మార్కులు సాధించారని తెలిపారు. మరో 55 మంది విద్యార్థులు 200కు పైగా మార్కులు పొందారన్నారు. విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

25 నుంచి సెలవులోకి డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్ఓ) విఘ్నేష్ వ్యక్తిగత పనులపై ఈనెల 25వ తేదీ నుంచి నెల రోజులపాటు సెలవులో వెళ్లనున్నారు. ఆ మేరకు ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అనుమతి వచ్చిన వెంటనే సెలవులోకి వెళ్లనున్నారు. ఇన్‌చార్జి డీఎఫ్ఓగా శ్రీసత్యసాయి జిల్లా అటవీ శాఖాధికారి చక్రపాణిని నియమించే అవకాశం ఉంది.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ కోరుతూ నిరవధిక దీక్ష

ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి



మాట్లాడుతున్న సాకే హరి

అనంతపురం సెంట్రల్, మే 22(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలంటూ నిరవధిక నిరాహార దీక్ష చేపడుతున్నట్లు ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి పేర్కొన్నారు. గురువారం ఆర్డీటీని కాపాడాలంటూ అఖిలపక్ష కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపించిన ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైవుందన్నారు. ఆర్డీటీ సేవల కొనసాగింపుకు ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయడంలో కేంద్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్నారు. ఈ అంశంపై ఇప్పటికే తొమ్మిదిరోజుల పాటు రిలేదీక్షలు చేపట్టడం జరిగిందని అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోనూ. ప్రజాప్రతినిధుల్లోనూ చలనం రావడంలేదని వాపోయారు. దీంతో త్వరలోనే ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, సుగమంచి శ్రీనివాసులు, రాజు, ఆనంద్, సూర్యనారాయణ, నరేంద్ర, రామలింగ పాల్గొన్నారు.

దౌర్జన్యంగా వచ్చిన వారిపై చర్యలు తీసుకోండి

- ఎస్పీని కోరిన మేయర్ వసీమ్

అనంతపురం క్రైం, మే 22(ఆంధ్రజ్యోతి): నగరపాలిక కార్యాలయంలోని తన చాంబర్‌లోకి అక్రమంగా వచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని నగర మేయర్ మహమ్మద్ వసీమ్ జిల్లా ఎస్పీ జగదీష్‌ను కోరారు. గురువారం డిప్యూటీ మేయర్ సాహిత్య, కార్పొరేటర్లతో కలిసి మేయర్ ఎస్పీని ఆయన చాంబర్‌లో కలిశారు. బుధవారం మేయర్ చాంబర్‌కు టీడీపీ నాయకులు లక్ష్మీనరసింహ, సరిపూటి శ్రీకాంత్, నారాయణస్వామి, నాగార్జున తదితరులు అనుమతి లేకుండా వచ్చి సీఎం, డిప్యూటీ సీఎంల ఫొటోలు పెట్టారన్నారు. ఇది టీడీపీ నాయకుల దౌర్జన్యాలకు పరాకాష్ట అన్నారు. తన ఛాంబర్‌లో వారి ఫొటోలు పెట్టాలంటే కమిషనర్ ద్వారా ఏర్పాటు చేయాలని, అటెండర్‌ను బెదిరించి ఫొటోలు ఏర్పాటు చేసిన తీరును ఖండిస్తున్నామన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఛాంబర్‌లో టీడీపీ ప్రజాప్రతినిధులు మీడియా సమక్షంలోనే అధికారులతో దురుసుగా ప్రవవర్తించారన్నారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న డీలర్లు

ఉరవకొండ, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ వాహనాలను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు గాను పట్టణంలో డీలర్ల సంఘం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లను తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. డీలర్ల వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీలర్లు ఈశ్వర్, రమేష్, ఉట్టిరాము, రాజు, బుడేన్, ముద్దలాపురం రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

నీటికుంట పనులు నెలాఖరుకు పూర్తవ్వాలి

కూడేరు, మే 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఫారంపాండ్ పనులను త్వరగా పూర్తి చేయాలని డ్వామా పీడీ సలీమ్ బాషా ఆదేశించారు. మండలంలోని అరవకూరు గ్రామ సమీపంలో జరుగుతున్న ఫారంపాండ్ పనులను గురువారం ఆయన పరిశీ లించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. మండలవ్యాప్తంగా 66 ఫారంపాండ్లు మంజూరయ్యాయని, వాటిని ఈ నెలాఖరికి పూర్తి చేయాలని అన్నారు. ఆయన వెంట ఏపీఓ పోలేరయ్య తదితరులు ఉన్నారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి తీవ్రగాయాలు

యాడికి, మే 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభంపై నుంచి పడి నబీ రసూల్ అనే వ్యక్తికి తీవ్రగాయాలపాలైన సంఘటన మండలంలోని తిరునాంపల్లి వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కోనుప్పలపాడు గ్రామానికి చెందిన నబీరసూల్ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్నాడు. అయితే గురువారం తిరుణాంపల్లి వద్ద కరెంట్ స్తంభాల మార్పునకు సంబంధించి ఒక కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తుండగా.. కరెంట్ సరఫరా అయి షాక్ కొట్టింది. దీంతో అతను స్తంభం నుంచి కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం యాడికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌ను వివరణ కోరడానికి ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

సాధారణ కాన్పులు పెంచాలి

పామిడి, మే 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో సాధారణ కాన్పులు పెంచాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ వైద్యులకు సూచించారు. పట్టణంలోని సీహెచ్‌సీని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి వైద్యులతో మాట్లాడుతూ.. ప్రతి గర్భిణీకి సాధారణ ప్రసవాలు చేయాలన్నారు. తప్పనిపరిస్థితి అయితేనే సిజేరియన్ చేయాలన్నారు. ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్‌తో పాటు ఎన్నో పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారన్నారు. అలాగే అవసమైన ఆపరేషన్లను ఉచితంగా చేస్తున్నారన్నారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు. కంటి, ఎముకల వైద్యులను నియమించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రోగులు తమ ఆధార్, ఆరోగ్య శ్రీ కార్డుతో ఎన్టీఆర్ వైద్య సేవలో వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. దీంతో ఆ రోగికి కేటాయించిన నెంబర్ ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా ప్రభుత్వాసుపత్రిలలో ఉచితంగా వైద్య సేవలందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డి, వైద్యులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికుడికి అస్వస్థత

గుంతకల్లు, మే 22(ఆంధ్రజ్యోతి): రైలులో గోవా నుంచి పశ్చిమ బెంగాల్‌కు వెళ్తున్న ఓ ప్రయాణికుడు అస్వస్థతకు గురైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పురూలియా జిల్లా ధనార్దీకి చెందిన ఇంతియాజ్ అన్సారీ అనే పాతికేళ్ల యువకుడు గోవాలో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. గురువారం స్వస్థలానికి వెళ్లడానికి అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. గుంతకల్లు సమీపంలోకి రాగానే అస్వస్థతకు లోనయ్యాడు. రక్తపు వాంతులు కావడంతో గమనించిన టీటీఈ గుంతకల్లు రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. రైలు వచ్చేలోపు అంబులెన్సును సిద్ధంగా ఉంచిన అధికారులు ఇంతియాజ్ అన్సారీని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతడికి ప్రథమ చికిత్సలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గుత్తిరూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నేదొడ్డి గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం రాచర్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు(44) గుత్తికి వచ్చి బైక్‌పై వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. వన్నేదొడ్డి గ్రామశివారులోకి రాగానే బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడి అక్కడికి అక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని పోలీసులు పేర్కొన్నారు.

ఉరేసుకుని కర్ణాటక వాసి..

డీ.హీరేహాళ్, మే 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని సిద్ధాపురం అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి గత 15 రోజుల క్రితం ఉరివేసుకొని చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్ణాటక రాష్ట్రం సండూరు తాలూకా తుమ్మటి గ్రామానికి చెందిన గంగాధర(32) జిందాల్ కర్మాగారంలో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కాగా నెల క్రితం ఓ పని నిమిత్తం బెంగళూరుకు వెళుతున్నట్లు తల్లితో చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. అనంతరం అతడికి ఫోన్ చేయగా స్విచ్ వచ్చిందని, అప్పటి నుంచి చాలాచోట్ల వెతికినా ఆచూకి తెలియరాలేదని కుటుంబసభ్యులు తెలిపారు. కాగా గురువారం సిద్ధాపురం గ్రామ సమీపంలో గొర్రెల కాపరులు చెట్టుకు వ్యక్తి ఉరివేసుకొని వేళాడుతుండడం చూసి పోలీసులకు తెలిపారు. వెంటనే ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడిని గుర్తించి విషయం కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడి తండ్రి గౌసిద్దేశ్వరగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

తాడిపత్రి, మే 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని చుక్కలూరు గ్రామానికి చెందిన శేఖర్ (40) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఐదురోజులక్రితం ఆయన గ్రామంలో నడుచుకొని వెళుతుండగా గుర్తుతెలియని బైక్ ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. కుటుంబసభ్యులు వెంటనే కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

టీడీపీ వార్డు ఇన్‌చార్జిపై కొడవలితో దాడి



గాయపడిన సాయిప్రసాద్

గుంతకల్లుటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవ్‌నగర్‌లో నివాసముంటున్న టీడీపీ 2వ వార్డు ఇన్‌చార్జి ముక్కన్న గారి సాయిప్రసాద్‌పై గురువారం రాత్రి కొందరు వేటకొడవళ్లతో దాడి చేశారు. కసాపురం పోలీసులు, బాధితుడి కుటుంబసభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సాయిప్రసాద్ రాత్రి సమయంలో ఇంటి వద్ద ఉండగా.. కొందరు ఆటోలో వచ్చారు. అతడి భార్య, తల్లిని ఇంట్లోకి తోసి తలుపులు వేశారు. ఇంటిఅద్దాలను పగలకొట్టారు. తర్వాత సాయిప్రసాద్‌పై కొడవలితో దాడి చేసి పరారయ్యారు. ఈ దాడిలో తల, కుడి, ఎడమ కాలికు గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సాయిప్రసాద్‌ను కర్నూలుకు తరలించాలని వైద్యులు సూచించారు. మూడు రోజుల క్రితం చిన్న పిల్లలు క్రికెట్ విషయంలో గొడవ కారణంగా ఈ దాడి జరిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధితుడు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కసాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో హనుమజ్జయంతి

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు



పెద్దవడుగూరులో ఉత్సవమూర్తి ఊరేగింపు



పుష్పాలంకరణలో నేమకల్లు ఆంజనేయ స్వామి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: హనుమాన్ జ యంతి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని అన్ని పట్టణాలు, మండలకేంద్రాలతో పాటు గ్రామాల్లో సైతం హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయమే అ ర్చకులు మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అ లంకరణలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చనలు, మహామంగళహారతి ఇచ్చి నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలు గ్రామాల్లో సాయంత్రం ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తిని పల్లకిలలో ఊరేగించారు. పలుచోట్ల భక్తులు శోభాయాత్ర చేశారు. పలు ఆలయాల వద్ద కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు చేపట్టారు. భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. రామాలయాల్లో సైతం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. రాయదుర్గం పట్టణంలోని ఉక్కడ ఆంజనేయస్వామి ఆలయాన్ని ప్రభుత్వ విప్ కాలవశ్రీనివాసులు సతీసమేతంగా సందర్శించారు. అర్చకులు ఘన స్వాగతం పలికి స్వామి దర్శనం చేయించి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే పామిడి పట్టణంలోని కోట ఆంజనేయస్వామిని టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ దర్శించి పూజలు చేయించారు. తర్వాత ఆలయ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి రూ. లక్ష విరాళం ఇచ్చారు. ఇందుకు ఆయన్ను ఆలయ కమిటీ వారు పూల మాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు.

కౌలు రైతు సమస్యలు పరిష్కరించాలంటూ ర్యాలీ



ర్యాలీ చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

ఉరవకొండ, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో గురువారం ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఎం కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఇందులో రాష్ట్ర కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతులను గ్రామసభల ద్వారా గుర్తించి, అన్నదాత సుఖీభవను అందజేయాలన్నారు. అలాగే దేవాలయ భూములను కౌలుకు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు నూతన చట్టం చేసి, రక్షణ కల్పించాలన్నారు. రైతుల ఆత్మహత్యలు నివారించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల అప్పులను మాఫీ చేసి, బ్యాంకుల నుంచి పంట రుణాలను ఇప్పించాలన్నారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ జూన్ 5వ తేదీన తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే 16వ తేదీన సీసీఎల్‌ఏ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, కార్యదర్శి బాలరంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కోలాహలంగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతిదూలాన్ని లాగుతున్న ఎద్దులు

తాడిపత్రి, మే 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గన్నెవారిపల్లికాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 14జతల వృషభాలు పాల్గొన్నాయి. కడప జిల్లా అలంకాన్‌పల్లి వెంకటరామిరెడ్డికి చెందిన వృషభాలు మొదటి బహుమతిగా రూ.50 వేలను గెలుచుకున్నాయి. అలాగే అదే జిల్లా తిప్పిరెడ్డిపల్లికి చెందిన విశ్వనాథ్‌రెడ్డికి చెందిన వృషభాలు ద్వితీయ బహుమతిగా రూ.40వేలు గెలుచుకున్నాయి. తాడిపత్రి మండలం కోమలి గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి వృషభాల తృతీయ బహుమతిగా రూ.30వేలు గెలుచుకున్నాయి. తాడిపత్రి పట్టణానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి వృషభాలు నాలుగో బహుమతిగా రూ.20వేలను గెలుపొందాయి. అదేవిధంగా పెద్దపప్పూరు మండలం శింగభట్లుపల్లి గ్రామానికి చెందిన వీరయ్యాయాదవ్, బొందలదిన్నెకు చెందిన గురురోహిత్ వృషభాలు చెరో రూ.10 వేల బహుమతిని సాధించాయి. నంద్యాలజిల్లా రంగాపురం గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి వృషభాల రూ.8వేలు బహుమతిని సాధించాయి. పోటీల్లో పాల్గొన్న వృషభాల యజమానులకు కన్సొలేషన్ బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



కుందుర్పిలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న నాయకులు

కుందుర్పి, మే 22(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో మండల కేంద్రంలో వివిధ పార్టీల నాయకులు గురువారం తిరంగా యాత్ర ర్యాలీ నిర్వహించారు. స్థానిక రామస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కెనరా బ్యాంకు వరకు కొనసాగింది. ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను చేతపట్టుకుని భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీతో పాటు పలు పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తిరంగార్యాలీకి తరలిరండి: జేసీపీఆర్

తాడిపత్రి: పట్టణంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు తిరంగా యాత్ర ర్యాలీ జరగనుందని, ఇందులో కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ పాల్గొనాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి గురువారం ప్రకటనలో కోరారు. మహాత్మగాంధీ సర్కిల్ నుంచి అశోక్‌పిల్లర్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు.

బాల్యవివాహాలపై అవగాహన

కుందుర్పి, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అంగన్‌వాడీకేంద్రంలో గురువారం ఎంఈఓ సోమేష్ కుమార్ బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. వాటిని అరికట్టడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అలాగే గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం నేరమని, ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కమ్యూనిటీ ఆరోగ్య అధికారి ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

సింగానహళ్లిలో తహసీల్దార్ విచారణ



భూరికార్డును పరిశీలిస్తున్న తహసీల్దార్

బొమ్మనహాళ్, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగానహళ్లి గ్రామంలో కెంచప్ప అనే రైతుకు చెందిన 0.60 ఎకరా భూమిని ఆన్‌లైన్‌లో తొలగించడంపై గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'గాడితప్పిన రెవెన్యూ పాలన' అనే శీర్షికన ప్రచురితమైంది. ఇందుకు తహసీల్దార్ మునివేలు వెంటనే స్పందించి సింగానహళ్లి గ్రామానికి వెళ్లి బాధిత రైతుతో మాట్లాడారు. ఆయనకు సంబంధించిన భూ రికార్డులను పరిశీలించారు. 119 సర్వే నంబర్‌లో కాలువ ఉందని, అది అప్పట్లో పానుపుస్తకంలో నమోదు చేయించుకున్నారని తెలిపారు. మిగతా సర్వే నంబర్లలో ఉమ్మడి జాయింట్‌గా ఉండడం వల్ల 1బీ అడంగల్ రాలేదని అన్నారు. పూర్తి రికార్డులను పరిశీలించి రైతుకు న్యాయం చేస్తామన్నారు. కెంచప్ప అన్నదమ్ములు ఐదుగురు కావడంతో ఇద్దరు అన్నదమ్ములు మాత్రమే పాసుబుక్కులు చేయించుకున్నట్లు విచారణలో తేలిందన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు నరసింహమూర్తి, సుజాత ఉన్నారు.

ఆంధ్రజ్యోతి స్పందన

రైల్వే డీజిల్ షెడ్‌లో గేట్‌మీట్

గుత్తి, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా పట్టణంలోని రైల్వే డీజిల్ షెడ్‌లో గురువారం గేట్ మీట్ నిర్వహించారు. డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడాలన్నారు. పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. జూన్ 5 వరకు నిర్వహించే పర్యవరణ కార్యక్రమాల్లో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏడీఎంఈ చంద్ర అశోక్‌గౌడ, ఎస్ఎస్ఈ జనరల్ మనోజ్, ల్యాబ్ ఇన్‌చార్జి పాల చంద్ర, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

మౌలికవసతులు కల్పించాలని వినతి

రాయదుర్గంరూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం పట్టణ సమీపంలో ఉన్న బీటీపీ రోడ్డు వద్ద 75 వీరాపురం కాలనీలో మౌలికవసతులు కల్పించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

యోగాతో మానసిక ప్రశాంతత

గుంతకల్లుటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రరావు, యునాని వైద్యురాలు సజీదా సుల్తానా సూచించారు. ఆసుపత్రిలోని యునాని వైద్యశాలలో గురువారం వారు యోగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21 నుంచి జూన్ 21 వ తేదీ వరకు యోగా నిర్వహిస్తోందన్నారు. యోగాతోనే శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కనుక ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయాలని తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో యోగా ట్రైనర్ శివనాగమనెమ్మ వైద్యులు, సిబ్బంది చేత యోగాసనాలు వేయించారు.

వీఓఏల నియామకానికి దరఖాస్తులు

ఉరవకొండ, మే 22(ఆంధ్రజ్యోతి): మండ ల వ్యాప్తంగా గ్రామసంఘాల్లో వీఓఏల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ ఎం శివయ్య గురువారం ప్రకటనలో తెలిపా రు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీఓఏలను మూడేళ్ల తర్వాత గ్రామ సంఘాల తీర్మాణం మేరకు మార్చుకోవడం జరుగుతుందన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 19 నుంచి 44 ఏళ్ల లోపు వయసు ఉండాలన్నారు. వీఓఏలలో మహిళలకే ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇప్పటికే 35మంది వీఓఏలను మార్చామని, త్వరలోనే మిగిలిన వాటిని భర్తీ చేస్తామని అన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు..

గుత్తి, మే 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేంద్రియ విద్యాలయంలో ఇంటర్ ప్రవేశాల కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మాలిభీ సాహెబ్ గురువారం ప్రకటనలో తెలిపారు. 2025-26 వ విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తులను ఆఫ్‌లైన్ మోడ్‌లో విద్యాలయం వద్ద సమర్పించాలన్నారు. పదో తరగతి ఇంగ్లిష్ మీడియంలో ఉత్తీర్ణులైన వారు గణితం, సైన్స్‌లో 60శాతం మార్కులు ఉండాలన్నారు. ఈనెల 30న సాయంత్రం 3గంటల లోపు కేంద్రియ విద్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అధికారులకు శిక్షణ

బ్రహ్మసముద్రం, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండలాధికారులకు స్వ ర్ణాంధ్ర విజన్ 2047పై ఆన్‌లైన్‌పై శిక్షణ ఇచ్చారు. వీరు శాఖల్లో అభివృద్ధి పనులను ఆన్‌లైన్‌లో ఎలా పొందుపరచాలో అవగాహన కల్పించారు.

సచివాలయ సిబ్బందిపై జేసీ ఆగ్రహం



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ

కూడేరు, మే 22, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్కూరు గ్రామ సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుండడంపై జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. గొట్కూరు గ్రామ సమీపంలోని అహుడా వెంచర్‌ను పరిశీలించేందుకు గురువారం ఆయన వచ్చారు. ఆ సమయంలో సచివాలయ సిబ్బంది కార్యాలయానికి తాళం వేసి వాహనాల్లో ఇంటిబాట పట్టారు. ఆ ప్రదేశంలో ఉన్న స్థానిక టీడీపీ నాయకులు గొట్కూరు జయరాం, అంజి సమయం పూర్తి కాకనే సచివాలయ సిబ్బంది వెళ్తున్న విషయాన్ని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. జేసీ ఉన్న విషయాన్ని తెలుసుకున్న సచివాలయ సిబ్బంది వెంటనే అప్రమత్తమై కార్యాలయానికి పరుగులు తీశారు. కొద్దిసేపటికి జేసీ సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది హాజరును పరిశీలించారు. అలాగే ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై సిబ్బందిని ప్రశ్నించారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడం, రికార్డులు సక్రమంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తులు పెండింగ్ ఉండటంపై డిప్యూటీ తహసీల్దారు సూర్యప్రకాష్‌పై మండిపడ్డారు. సకాలంలో ఎందుకు చేయడం లేదని ప్రశ్నించడంతో ఇన్‌చార్జీ తహసీల్దారు కారణంగా ఆలస్యమవుతున్నాయని సమాధానం చెప్పడంతో జేసీ అసంతృప్తి వ్యక్తం చేశారు.

అభయాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ

శెట్టూరు, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో అభయాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలో హోమాలు, వివిధ పూజలు చేశారు. అనంతరం వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామిని దర్శించి తీర్థ ప్రసాదాలు పొందారు. టీడీపీ నాయకుడు దేవినేని ధర్మతేజ పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు గ్రామస్థులు గ్రామ టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు.

ఇంట్లో చోరీ

గుంతకల్లుటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్న అనీఫ్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. అనీఫ్ ఈనెల 16వ తేదీన ఇంటికి తాళం వేసి అజ్మీర్‌కు వెళ్లాడు. ఆ మరుసటి రోజు ఉదయం ఇంటి తాళాలు పగిలిపోయి ఉండటాన్ని స్థానికులు గమనించి అతడికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన గురువారం వచ్చి చూడగా.. బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల బంగారు నగలు, 8 తులాలవెండి ఆభరణాలు, రూ, 50వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు చెప్పినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై తమకు ఫిర్యాదు అందలేదని టూటౌన్ పోలీసులు తెలిపారు.

23.8 మి.మీ.ల వర్షపాతం నమోదు

బెళుగుప్ప, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం రాత్రి 23.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వంకలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, చెక్ డ్యామ్‌లు భారీగా వరదనీరు చేరి జలకళను సంతరించుకుంటున్నాయి. ముందస్తు వర్షాలతో నల్లరేగడి భూములు పదునవుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన మహా కుంబాభిషేకం

యల్లనూరు, మే 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో నాలుగురోజులపాటు నిర్వహించిన మహాకుంబాభిషేక కార్యక్రమం గురువారంతో ముగిసింది. చివరిరోజు స్వామివారికి అర్చకులు ప్రత్యేకఅభిషేకాలు, అలంకరణలుచేసి పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిదర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కసాపురం ఆలయానికి నీటిట్యాంకర్ వితరణ

గుంతకల్లు టౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి నీటి ట్యాంకర్‌ను భక్తులు గురువారం వితరణ చేశారు. గుంతకల్లు పట్టణానికి చెందిన శ్రీనాథ్ ఏజెన్సీకి చెందిన కాశం శెట్టి చందు, విద్యాసాగర్ నీటి ట్యాంకర్‌ను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం వారు ఆలయంలో స్వామిని దర్శించి తీర్థ ప్రసాదాలు పొందారు. ఆలయ ఈఓ వాణి, ఆలయ ధర్మకర్త సుగుణమ్మ, ఆలయ ఏఈఓ వెంకటేశ్వరుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం తనిఖీ

రాయదుర్గం, మే 22(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాన్ని ఎస్పీఎం ట్రాన్స్‌కో ఈఈ రవిశంకర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ.. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లకు సకాలంలో మరమ్మతులు చేయాలని సూచించారు. ఇప్పటివరకు జరిగిన ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం వచ్చిన రైతులకు పలు సూచనలు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడైనా కాలిపోతే సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. విద్యుత్‌శాఖ వాహనాన్ని సమకూర్చి మరమ్మతు కేంద్రానికి తరలిస్తారని తెలిపారు. అందుకు ఎవరికీ ఎలాంటి సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. ఆయన వెంట ఎస్పీఎం ఏడీ మేఘరాజ్, ఏడీ శ్రీనివాస్‌నాయుడు ఉన్నారు.

బ్రాహ్మణపల్లి చెరువును కాపాడాలి

కూడేరు, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ చెరువు ఆక్రమణకు గురవుతోందని, అధికారులు సంరక్షించాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు రాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం పలువురు నాయకులతో కలిసి నిరసన చేశారు. బ్రాహ్మణపల్లి చెరువుని కొందరు ఆక్రమించుకుంటున్నారన్నారు. అధికారులు రక్షించాలని కోరారు.

డీవైఎఫ్ఐ సమావేశం

గుంతకల్లుటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో హంపిరెడ్డి భవనంలో గురువారం డీవైఎఫ్ఐ సమావేశం జరిగింది. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి కసాపురం రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. ముఖ్యంగా స్థానికంగా మూతపడిన స్పిన్నింగ్ మిల్లు స్థానంలో టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటాలు చేస్తామన్నారు. తర్వాత డీవైఎఫ్ఐ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేవీ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా సురేంద్రబాబు, ఉపాధ్యక్షులుగా శివరామ్, రంగా, వంశీ, రాకేష్, సహాయ కార్యదర్శులుగా కన్నయ్య, విక్రమ్, పరుశురామ్, కోశాధికారిగా శ్రీనాథ్‌తోపాటు 9 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి

గుంతకల్లుటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 26మంది నక్సల్స్‌ను బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా న్యాయవిచారణ జరిపించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బీ. సురేష్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒరిస్సాలో అనారోగ్యంతో ఉన్న మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావును పట్టుకొచ్చి కాల్చి చంపారన్నారు. ఆపరేషన్ కగార్‌ను ఏర్పాటు చేసి లక్షల మంది పారామిలటరీ దళాలతో కూంబింగ్ నిర్వహిస్తూ మావోయిస్టు నాయకులను, కార్యకర్తలను, ఆదివాసులను ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టుపార్టీతో శాంతిచర్చలు జరపాలని ఆయన కోరారు.

శాంతిర్యాలీని విజయవంతం చేయండి

పెద్దవడుగూరు, మే 22(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న అంతర్యుద్ధాన్ని వెంటనే ఆపాలని సీపీఎం మండల కార్యదర్శి దస్తగిరి కోరారు. మేరకు మండలకేంద్రంలో గురువారం తహసీల్దార్ ఉషారాణినిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మధ్యభారతంలో శాంతిని నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వం కాల్పులు విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలన్నారు. ఈ మేరకు విజ్ఞప్తి చేస్తూ జిల్లా కేంద్రంలో ఈనెల 25న శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ర్యాలీకి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ర్యాలీకి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, భూపతి, జయరాం, విజయ్, శంకర్, చిరంజీవి, గిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.